# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక :338 మంగళవారం 11-8-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/






## నిరసన ఉప్పెన

### జార్ఖండ్‌లో కదం తొక్కిన విద్యార్థులు, ఉద్యోగార్థులు

- అసెంబ్లీ ముట్టడికి యత్నం.. బారికేడ్లు దాటుకుని ముందుకు
- అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత.. లాఠీచార్జ్
- అంబులెన్స్‌లోనే ర్యాలీకి విద్యార్థినేత మహతో

02

జార్ఖండ్‌లో నియామక పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలు సోమవారం హింసాత్మకంగా మారాయి. అసెంబ్లీ ముట్టడికి యత్నించిన వేలాది మంది నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు వాటర్ క్యానన్లు, బాష్పవాయువు ప్రయోగించడంతో పాటు లాఠీచార్జ్ చేశారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడగా, రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.



## ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ దరఖాస్తు గడువు పొడిగింపు

- ఆగస్టు 15 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఇప్పటివరకు 46,121 దరఖాస్తులు
- వరుస సెలవుల నేపథ్యంలో మరో ఐదు రోజులు అవకాశం
- గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్

హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజుల పాటు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆగస్టు 15వ తేదీ శనివారం వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చి, నామమాత్రపు ధరలోనే పేద, మధ్యతరగతి ప్రజలకు సొంత ఇంటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పథకం ద్వారా లక్ష ఇళ్లను నిర్మిస్తున్నామని, అందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా 16 నియోజకవర్గాల్లో 7,340 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని ఆయన వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు

-మిగతా 2 లో

# రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

### నాగార్జునసాగర్‌లో వరుణయాగం

- పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి దంపతులు
- ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే సూచనలు
- ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగిస్తాం
- రైతాంగ ప్రయోజనాలే ప్రజా ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యం
- కృష్ణా--గోదావరి పరవళ్లు తొక్కాలి.. జలాశయాలు, చెరువులు నిండాలి
- నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి
- హాజరైన మంత్రులు, ముఖ్యనేతలు

హైదరాబాద్

రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, కృష్ణా, గోదావరి నదులకు మంచి ఇన్ ఫ్లో రావాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లో వరుణయాగం నిర్వహించింది. సాగర్‌లోని విజయ్ విహార్ ప్రాంగణంలో నిన్న సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు యాగ క్రతువు ప్రారంభం అయింది. యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు సూచించిన మేరకు 11 హోమ గుండాలలో 108 మంది రుత్వికులు ఈ క్రతువును నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ వైదిక క్రతువు వైభవంగా సాగింది. ఈ పవిత్ర యాగ కార్యక్రమాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు.

-మిగతా 2 లో






## చైనాలో డాల్ఫిన్ తుపాను విలయం

- 10 లక్షల మందికి పైగా ప్రజల తరలింపు
- షాంఘైలో వెయ్యి విమానాలు రద్దు
- బుధవారం వరకూ కుండపోత వర్షాల హెచ్చరిక
- గంటకు 150 కి.మీ. వేగంతో గాలులు
- ఆరు రాష్ట్రాలు, షాంఘైలో భారీ వర్షాలు
- పర్యాటక ప్రాంతాల మూసివేత.. పడవ ప్రయాణాలు బంద్
- వందకుపైగా ఆఫ్‌షోర్ ప్రాజెక్టులకు బ్రేక్
- ఫిలిప్పీన్స్‌లో తుపాను ప్రభావం.. 8 మంది మృతి

బీజింగ్

: ఆర్థిక రాజధాని షాంఘై సహా తూర్పు చైనాలో ఈదురుగాలులు, భారీ వర్షాలతో బీభత్సం సృష్టించిన డాల్ఫిన్ తుపాను జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. పది లక్షల మందికి పైగా ప్రజలను అధికారులు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుపాను కారణంగా రవాణా సౌకర్యాలు స్తంభించిపోయాయి. షాంఘైలో ఒక్క సోమవారం నాడే సుమారు వెయ్యి విమానాలు రద్దయ్యాయి.

-మిగతా 2 లో



02

## హెర్ముజ్ తెరిస్తే యుద్ధం బంద్

- అణు ఒప్పందం కోసం ఒత్తిడి వద్దు!
- ఇరాన్‌తో సంధికి ట్రంప్ యోచన

## ముస్లిం వివాహాలకు షరియా చట్టమే వర్తింపు



- కర్ణాటక హైకోర్టు సంచలన తీర్పు
- నికాహ్ నమోదు చేసినా స్వభావం మారదు
- విడాకుల పిటిషన్ చెల్లదన్న హైకోర్టు
- పర్సనల్ లా రద్దు కాదని స్పష్టీకరణ
- వివాహం కూడా అదే చట్టం కిందే జరగాలి

02

## హసీనాను అప్పగించండి

- భారత్‌ను మరోసారి కోరిన బంగ్లాదేశ్
- తారిక్ రెహ్మన్‌తో భారత హై కమిషనర్ దినేష్ త్రివేది భేటీ
- ద్వైపాక్షిక అంశాలతో పాటు హసీనా అప్పగింతపై చర్చ
- మోడీ అభినందన సందేశాన్ని అందజేసిన భారత ప్రతినిధి

02



# ప్రజల గుండెల్లో 'పెద్ది' శాశ్వతం

**ఎంతకాలం బతికామన్నది కాదు.. ఎట్లా బతికామన్నదే ముఖ్యం**

- అంతిమ యాత్రకు లక్షలాది జనం తరలిరావడమే అందుకు నిదర్శనం
- అధికారంలోకి రాగానే నర్సంపేట మెడికల్ కాలేజీకి 'పెద్ది' పేరు పెడుతాం
- ఆ కుటుంబానికి అండగా ఉంటాం
- సుదర్శన్‌రెడ్డి సంస్మరణ సభలో కేటీఆర్

వరంగల్,

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి ధన్యజీవి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లిలో సోమవారం నిర్వహించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి సంస్మరణ సభలో మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సమయంలో భావోద్వేగానికి గురయ్యారు. చమర్చిన కండ్లతో పెద్ది చిత్రపటంపై పూలు జల్లారు. నివాళులర్పించే సమయంలోనూ ఉద్విగ్నతకు గురయ్యారు నంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. పెద్ది కుమారుడు, కూతురును దగ్గరికి తీసుకొని హత్తుకున్నారు. పెద్ది కుటుంబ

-మిగతా 2 లో






## అమిత్ షా సభకు రావాలి

- విద్యార్థులపై పోలీసుల దాడి పట్ల ప్రకటన చేయాలి
- పార్లమెంట్ లో ప్రతిపక్షాల ఆందోళన
- రాజ్యసభలో సభ్యుల వాకౌట్
- ఉభయసభల్లో చెరో బిల్లు ఆమోదం
- లోక్‌సభలో నాలుగు బిల్లులను ప్రవేశపెట్టిన కేంద్రం

న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు రావాలని, విద్యార్థులపై పోలీసుల దాడి పట్ల ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు, కేంద్ర బలగాల దాడి, అయోధ్య రామమందిరం విరాళాల చోరీకి వ్యతిరేకంగా సోమవారం పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. రాజ్యసభలో విపక్షాలు వాకౌట్ చేశాయి. లోక్‌సభను ప్యానెల్ స్పీకర్ ప్రేమచంద్రన్ ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించగా ప్రతిపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు హోరెత్తించారు. జులై 20న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీ గురించి వివరణ ఇవ్వాలని, కేంద్ర మంత్రి అమిత్ షా సభకు రావాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సభ సమావేశమైన కొన్ని సెకన్లలోనే మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే నాలుగు బిల్లులను ప్రవేశపెట్టారు.

-మిగతా 2 లో



## టూరిజం స్పాట్‌గా కర్రెగుట్టలు

- నాడు మావోయిస్టుల కంచుకోట
- ఆపరేషన్ కగార్ ద్వారా మావోయిస్టుల ఏరివేత
- 700 మంది మావోయిస్టులు లొంగుబాటు.. మిగిలింది ఇద్దరే.. : రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్
- దండకారణ్యంలో రాష్ట్ర పోలీస్ బాస్
- ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు తడపాల వద్ద పావురం ఎగురవేత
- పాముసూరు గిరిజనులతో మాటామంతి

వెంకటాపురం

”కర్రెగుట్టలు 50 దశాబ్దాలు మావోయిస్టు పార్టీ కంచుకోట, ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుల అడ్డాగా ఉన్నాయి.. నేడు సీఆర్పీఎఫ్ ఔట్ పోస్టులు ఏర్పాటు చేసి సుందరవంతమైన టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తున్నాం” అని తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం దట్టమైన అడవుల్లో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ

-మిగతా 2 లో

# ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ దరఖాస్తు గడువు పొడిగింపు

మొదటి తరువాయి



టవర్స్‌పై ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందని, పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అయితే రెండో శనివారం, బోనాల పండుగ తదితర వరుస సెలవుల కారణంగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా గడువు పొడిగించాలంటూ వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజుల పాటు పొడిగించి ఆగస్టు 15 వరకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. తొలుత ప్రకటించిన ప్రకారం దరఖాస్తుల స్వీకరణ గడువు ఆగస్టు 10, సోమవారం వరకు ఉంది. గత నెల జులై 21వ తేదీ నుంచి మీ-సేవా కేంద్రాలతో పాటు ఆన్‌లైన్ ద్వారా, మీ-సేవా వాట్సాప్ సేవ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆగస్టు 10, సోమవారం సాయంత్రం నాటికి మొత్తం 46,121 దరఖాస్తులు అందినట్లు మంత్రి తెలిపారు. వరుసగా సెలవులు రావడంతో మరింత మంది అర్హులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో గడువు పొడిగించినట్లు మంత్రి పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచినప్పటికీ, దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ, కేటాయింపు, లాటరీ తదితర ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెలాఖరు నాటికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియపై దరఖాస్తుదారులు ఎటువంటి అపోహలు, అనుమానాలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. అర్హత ప్రమాణాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియను నిర్వహిస్తామని స్పష్టం చేశారు.


నియోజకవర్గాల వారీగా వచ్చిన దరఖాస్తులు

నియోజకవర్గం.. దరఖాస్తులు

అంబర్‌పేట్ 3,073, బహుదూర్‌పుర 1,706, ఇబ్రహీంపట్నం 1,031, కార్వాన్ 2,184, ఖైరతాబాద్ 5,518, కూకట్‌పల్లి 6,615, మహేశ్వరం 734, మలక్‌పేట 3,609, మల్కాజిగిరి 1,333, మేడ్చల్ 1,668, నాంపల్లి 4,372, కుత్బుల్లాపూర్ 5,571, రాజేంద్రనగర్ 2,060, సనత్‌నగర్ 1,404, సికింద్రాబాద్ (కంటోన్మెంట్) 1,755, శేరిలింగంపల్లి 3,488, మొత్తం

# హెర్ముజ్ తెరిస్తే యుద్ధం బంద్

**-అణు ఒప్పందం కోసం ఒత్తిడి వద్దు!**
**-ఇరాన్‌తో సంధికి ట్రంప్ యోచన**



వాషింగ్టన్

ఇరాన్‌ను అణ్వాయుధాలు తయారు చేయకుండా అడ్డుకుంటామంటూ ఆ దేశంతో యుద్ధానికి దిగిన అమెరికా ఇప్పుడు ఖర్చులు భరించలేక బయటపడే మార్గాలను వెతుక్కుంటున్నది. అణు కేంద్రాలన్నింటినీ శాశ్వతంగా మూసివేయాలని, అణ్వాయుధాలు తయారు చేయబోమని పేర్కొంటూ తమతో ఒప్పందం చేసుకోవాలని ఇప్పటిదాకా ఒత్తిడి చేసిన ట్రంప్ సర్కార్ ఇప్పుడు తోక ముడిచినట్టు తెలుస్తున్నది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అణు ఒప్పందం కోసం ఒత్తిడి చేయడానికి బదులుగా హెర్ముజ్ జలసంధిని వాణిజ్య నౌకల రాకపోకల కోసం పూర్తిగా పునరుద్ధరిస్తే యుద్ధానికి ముగింపు పలకాలని, అణు సమస్యను పక్కనపెట్టి విజయాన్ని ప్రకటించడానికి అమెరికా యంత్రాంగం సిద్ధంగా ఉండవచ్చని 'వాల్‌స్ట్రీట్ జర్నల్' కథనం పేర్కొన్నది. కాగా, ఇరాన్ భారీ డిమాండ్లను ముందుకు తీసుకురావడంతో గౌరవప్రదమైన పరిష్కారాన్ని కనుగొనడం క్లిష్టంగా మారింది. వందల కోట్ల డాలర్ల చెల్లింపులు, అమెరికా నౌకాదళ దిగ్బంధనం తొలగింపు, ఆ ప్రాంతం నుంచి అమెరికా బలగాల సంపూర్ణ ఉపసంహరణ, ఇతర కీలక రాయితీలను ఇరాన్ కోరుతున్నది. ఈ షరతులు అమెరికా దౌత్యపరమైన అవకాశాలను పరిమితం చేశాయి.

# చైనాలో డాల్ఫిన్ తుపాను విలయం

మొదటి తరువాయి

తుపాను ఉత్తర దిశగా కదులుతున్నందున బుధవారం వరకూ కుండపోత వర్షాలు కురుస్తాయని, వరదలు సంభవిస్తాయని, కొండచరియలు విరిగిపడతాయని అధికారులు హెచ్చరించారు. ఈ ఏడాది చైనాను తాకిన అతి బలమైన డాల్ఫిన్ తుపానును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ముందుగానే అత్యున్నత స్థాయి రెడ్ అలర్ట్ జారీ చేసింది. జెజియాంగ్ రాష్ట్రంలోని యుహువాన్‌ను ఆదివారం తుపాను తాకినప్పుడు గరిష్టంగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. ఆ తర్వాత వెన్‌జౌ నగరంలో తుపాను రెండోసారి తీరాన్ని తాకింది. షాన్డాంగ్, హెనాన్, హుబే, అన్హూరు, జియంగ్సూ, జెజియాంగ్ రాష్ట్రాలలో, షాంఘై నగరంలో సోమవారం భారీ వర్షాలు పడ్డాయి. తుపాను కారణంగా అనేక పర్యాటక ప్రాంతాలను అధికారులు మూసివేశారు. కొన్ని ప్రాంతాలలో బహిరంగ ప్రదేశాలలో పార్కింగ్ ఫీజును రద్దు చేశారు. అత్యవసర ఆవాసాలను ఏర్పాటు చేశారు. ఫుజియన్ రాష్ట్రంలో పడవ ప్రయాణాలను నిలిపివేశారు. వందకు పైగా ఆఫ్‌షోర్ నిర్మాణ ప్రాజెక్టులను ఆపేశారు. తీరాన్ని తాకడానికి ముందు తుపాను ఆరు వేల కిలోమీటర్ల దూరానికి పైగా ప్రయాణించింది. కాగా తుపాను ప్రభావంతో ఫిలిప్పీన్స్‌లో, తైవాన్ ఉత్తర ప్రాంతంలో, జపాన్‌లోని ఒకినావా దీవిలో వర్షాలు పడ్డాయి. డాల్ఫిన్స్ తుపాను కారణంగా ఫిలిప్పీన్స్‌లో కురిసిన భారీ వర్షాలకు ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు.

# హసీనాను అప్పగించండి

**-భారత్‌ను మరోసారి కోరిన బంగ్లాదేశ్**
**-తారిక్ రెహ్మాన్‌తో భారత హై కమిషనర్ దినేష్ త్రివేది భేటీ**
**- ద్వైపాక్షిక అంశాలతో పాటు హసీనా అప్పగింతపై చర్చ**
**- మోడీ అభినందన సందేశాన్ని అందజేసిన భారత ప్రతినిధి**



ఢాకా : మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాల్సిందిగా బంగ్లాదేశ్ మరోసారి భారత్‌ను కోరింది. భారత హై కమిషనర్ దినేష్ త్రివేదీ సోమవారం ఢాకాలో బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహ్మాన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హసీనాను అప్పగించాల్సిందిగా భారత్‌కు బంగ్లాదేశ్ విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో అనేక ముఖ్యమైన ద్వైపాక్షిక అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చాయని బంగ్లాదేశ్ ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేసింది. కాగా ప్రధాని నరేంద్ర మోడీ పంపిన అభినందన సందేశాన్ని త్రివేది అందజేశారని, బంగ్లాదేశ్ ప్రధానితో, ప్రజలతో సానుకూల, నిర్మాణాత్మక దృక్పథంలో పనిచేయాలని మోడీ ఆకాంక్షించారని భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో వివరించింది.

# నిరసన ఉప్పెన

**-జార్ఖండ్‌లో కదం తొక్కిన విద్యార్థులు, ఉద్యోగార్థులు**
**-అసెంబ్లీ ముట్టడికి యత్నం.. బారికేడ్లు దాటుకుని ముందుకు**
**-అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత.. లాఠీచార్జ్**
**-అంబులెన్స్‌లోనే ర్యాలీకి విద్యార్థినేత మహతో**



**రాంచీ:**
జార్ఖండ్ రాష్ట్రంలో పరీక్షల వివాదం హింసాత్మకంగా మారింది. ప్రభుత్వ నియామక పరీక్షల్లో జరిగిన క్రమరాహిత్యాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వేలాది ఉద్యోగార్థులు సోమవారం రాష్ట్ర అసెంబ్లీ సమీపంలో పోలీసులతో ఘర్షణ పడ్డారు. వారు అసెంబ్లీ చేరకుండా నిలువరించేందుకు భద్రతా సిబ్బంది వాటర్ కానన్లు, బాష్పవాయుగోళాలు, లాఠీచార్జ్ వంటి చర్యలు తీసుకున్నారు. జాతీయ జెండా, ప్లకార్డులు పట్టుకుని వచ్చిన నిరసనకారులు భారీ భద్రతా ఏర్పాట్లు ఉన్నప్పటికీ అనేక బారికేడ్లను దాటారు. పలువురు నిరసనకారులు పోలీసు చర్యలలో గాయపడ్డామని ఆరోపించారు. ఈ హింసాత్మక ఘటన జార్ఖండ్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే చోటు చేసుకుంది. ఇదే రోజు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ 51వ పుట్టినరోజు కావడం గమనార్హం! నిరసనకారులు చేపట్టిన మార్చ్ ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పాత అసెంబ్లీ భవనం బయట నుంచి ప్రారంభమై ప్రస్తుతం అసెంబ్లీ భవన సముదాయం వైపు కదిలింది. భద్రతా సిబ్బంది గుంపును నియంత్రించేందుకు ప్రయత్నించినా నిరసనకారులు ఒక బారికేడ్ తర్వాత మరో బారికేడ్‌ను దాటుకుంటూ ముందుకు సాగారు. జగన్నాథ్ పూర్ ఆలయం సమీపంలోని చివరి బారికేడ్ వద్దకు చేరుకున్న పుడు పోలీసులు వాటర్ కానన్లను ఉపయోగించారు. ప్రారంభంలో నిరసనకారులు త్రివర్ణ పతాకాలను ఊపుతూ నృత్యం చేశారు. కానీ అసెంబ్లీ వైపు ముందుకు సాగాల ని వారు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

**అసెంబ్లీ దగ్గర్లో లాఠీచార్జ్**

అసెంబ్లీకి సుమారు 200 మీటర్ల దూరంలో నిరసనకారులు ఉన్నప్పుడు పోలీసులు వారిపై లాఠీఛార్జ్ చేశారు. అనేక రౌండ్ల బాష్పవాయుగోళాలు ప్రయోగించారు. పోలీసులు తమ తలలు, చేతులు, ముఖాలపై కొట్టారని పలువురు నిరసనకారులు ఆరోపించారు. అనేక మంది మహిళా విద్యార్థులు గాయపడ్డారని, పోలీసులు తలలు, చేతులు, ముఖాలు అన్ని చోట్లా కొట్టారని ఆయన ఆరోపించారు. పోలీసు చర్యలలో తలలు గాయమైందని హజారీబాగ్ నుంచి వచ్చిన విక్రమ్ కుమార్ చెప్పారు. హేమంత్ సోరెన్ ప్రభుత్వం తమ పట్ల చేస్తున్నది మంచిది కాదని, తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నాము కాబట్టి పోలీసులు లాఠీచార్జ్ ఎందుకు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అంబులెన్స్‌లో వచ్చిన మహతో తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో అంబులెన్స్‌లో వచ్చి మార్చ్‌లో చేరారు. తర్వాత ఆయనను వైద్య సిబ్బంది స్ట్రెచర్‌పైన తీసుకెళ్లారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ ఛైర్మన్ ఎల్ షియాంగ్‌ను రాష్ట్ర సీఐడీ అరెస్టు చేసింది. కమిషన్ నిర్వహించిన 14వ సివిల్ సర్వీసెస్ పరీక్షకు సంబంధించి చిన ఆరోపణల నేపథ్యంలో ఈ అరెస్టు జరిగింది. బ్లాక్‌లిస్ట్ చేసిన టీడీపీఎల్ అనే సంస్థను జేపీఎస్సీ 14వ సివిల్ సర్వీసెస్ పరీక్ష నిర్వహణకు ఎందుకు ఎంపిక చేశారనే అంశంపై షియాంగ్‌ను ప్రశ్నించారు. జార్ఖండ్ ముఖ్య కార్యదర్శి గా పనిచేసిన షియాంగ్ 2026 జులై 22న జేపీఎస్సీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు.

**విద్యార్థులపై బలప్రయోగం తప్పు: రాహుల్ గాంధీ**

శాంతియుత నిరసన విద్యార్థుల హక్కు అని నొక్కి చెప్పిన లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం జార్ఖండ్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బలప్రయోగాన్ని ఖండించారు. విద్యార్థులపై బలప్రయోగం తప్పు. విద్యార్థులకు శాంతియుత నిరసన హక్కు ఉంది. చర్చ ద్వారానే పరిష్కారం వస్తుంది అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జార్ఖండ్ ప్రభుత్వం ఈ విద్యార్థుల మాట వినాలి. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన అన్నారు. ఇండియా బ్లాక్ మిత్రపక్షంపై వచ్చిన విమర్శలకు ఇది ప్రతిస్పందనగా నిలిచింది. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనపై రాహుల్ గాంధీ నిశ్శబ్దం పాటించారని బీజేపీ పదేపదే విమర్శించింది. జార్ఖండ్‌ను జేఎంఎం పార్టీ పాలిస్తోంది. ఇది కాంగ్రెస్‌తో ఇండియా బ్లాక్‌లో మిత్రపక్షంగా ఉంది.

# రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

మొదటి తరువాయి

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ వరుణయాగం ముగింపులో పూర్ణాహుతిని స్వీకరించారు. రుతుపవనాల నిష్క్రమణకు రెండు నెలల కంటే తక్కువ సమయం మాత్రమే మిగిలి ఉన్న తరుణంలో వర్షపాత లోటు ముప్పు పొంచి ఉండటంతో, తెలంగాణ ప్రభుత్వం సోమవారం కృష్ణా మరియు గోదావరి నదీ పరివాహక ప్రాంతాలలో వర్ష దేవుడైన వరుణుని అనుగ్రహం కోసం సంప్రదాయ పూజ అయిన 'వరుణ యాగం' నిర్వహించినట్లు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తెలిపారు.

రైతన్న క్షేమం కోసం నాగార్జునసాగర్‌లో మహా వరుణయాగం

తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా--గోదావరి నదులు జలకళతో పరవళ్లు తొక్కాలని, నాగార్జునసాగర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జలాశయాలు, చెరువులు నిండాలని, వానాకాలం పంటలు సమృద్ధిగా పండి రైతాంగం సుఖసంతోషాలతో ఉండాలన్న ఆకాంక్షతో నాగార్జునసాగర్ పవిత్ర కృష్ణానది తీరంలో మహా వరుణయాగం నిర్వహించినట్లు నీటిపారుదల, శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ వానాకాలంలో రాష్ట్రంలో వర్షాల తీరు, వాటి పంపిణీ ఆశించినంత స్థిరంగా లేదని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయానికి ఒకటి రెండు సందర్భాల్లో కురిసే భారీ వర్షాల కంటే పంట కాలమంతా అవసరమైన సమయంలో, అవసరమైన ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవడం అత్యంత ముఖ్యమన్నారు. వర్షాల మధ్య సుదీర్ఘ విరామాలు ఏర్పడితే పంటల ఎదుగుదలతో పాటు సాగునీటి అవసరాలపైనా ప్రభావం పడుతుందని చెప్పారు.

నదులు పరవళ్లు తొక్కాలని - రైతాంగం సుభిక్షంగా ఉండాలని

సాగర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జలాశయాలు, చెరువులు నిండాలని, కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ వరుణయాగం నిర్వహించినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రైతాంగ ప్రయోజనాలే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని మంత్రి ఉత్తమ్ వివరించారు. ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటూనే, సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ప్రకృతి అనుగ్రహాన్ని కూడా కోరుకుంటున్నామని మంత్రి చెప్పారు. పూర్ణాహుతి అనంతరం ముఖ్యమంత్రి నాగార్జున సాగర్ డ్యామ్‌ను పరిశీలించారు. జలాశయంలో డెడ్ స్టోరేజ్కి చేరిన నీటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరుణయాగంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# టూరిజం స్పాట్‌గా కర్రెగుట్టలు

మొదటి తరువాయి

సరిహద్దు ప్రాంతం కర్రెగుట్టల్లో మంగళవారం డీజీపీ పర్యటించారు. పామునూరు బేస్ క్యాంపును పరిశీలించారు. సరిహద్దుల్లోని తడపాల సీఆర్పీఎఫ్ 196వ బెటాలియన్ బేస్ క్యాంపును పరిశీలించారు. తడపాల బేస్ క్యాంపు వద్ద శాంతికి చిహ్నంగా పావురాలను ఎగరవేశారు. జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం డీజీపీ విలేకరులతో మాట్లాడుతూ.. ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న కర్రెగుటల్లో.. సీఆర్పీఎఫ్, గ్రేహౌండ్స్, కోబ్రా, తెలంగాణ పోలీసులు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసుల సమన్వయంతో వారిని ఇక్కడి నుంచి పారదోలి పోలీసుల అవుట్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పామునూరు నుంచి ఛత్తీస్‌గఢ్ సరిహద్దు వరకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. మావోయిస్టుల ఆధీనంలో ఉన్న కర్రెగుట్టలను పామునూరు, డోలి అటవీ ప్రాంతాల్లో పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్టు తెలిపారు. మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా రోడ్డుగా ఆధునీకరిస్తామన్నారు. కర్రెగుటల్లో ఎన్నో సుందరమైన ప్రాంతాలు ఉన్నాయన్నారు. ఆపరేషన్ కగార్ ద్వారా మావోయిస్టుల శకం ముగిసిందని చెప్పారు. ఎన్‌కౌంటర్లలో కీలక నేతలు మృతిచెందినట్టు తెలిపారు. ఒడిశా, గడ్చిరోలి, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులు, కీలక నేతలు 700మందికి పైగా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారని గుర్తు చేశారు. సెంట్రల్ కమిటీ జనరల్ సెక్రెటరీ ముప్పాల లక్ష్మణరావు ఎలియాస్ గణపతి, ఆయన భార్య తదితర ఒకరిద్దరు మావోయిస్టులు మాత్రమే మిగిలారని తెలిపారు. జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులను, వారి కుటుంబాలను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. వారికి ఇండ్లు, వ్యవసాయ భూములు, వారి పేరుపై ఉన్న రివార్డులను ప్రభుత్వం వారికే అందిస్తుందని చెప్పారు.

# అమిత్ షా సభకు రావాలి

మొదటి తరువాయి

న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ట్రిబ్యునల్స్ రిఫార్మ్స్ బిల్లును, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్మెంట్ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. గనులు, ఖనిజాల సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్ష ఎంపీలు వ్యతిరేకించారు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కేరళం పేరు మార్పు బిల్లును హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్, నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సవరణ బిల్లును మంత్రి మురళీధర్ మోహల్ ప్రవేశపెట్టారు. అనంతరం సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. దీంతో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ఎటువంటి చర్చ లేకుండానే ట్రిబ్యునల్స్ రిఫార్మ్స్ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా చర్చకు సిద్ధంగా ఉన్నారని, ప్రతిపక్షాలు సభ సజావుగా సాగేందుకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. దీనికి ప్రతిపక్ష ఎంపీ కె.సి వేణుగోపాల్ స్పందిస్తూ చర్చకంటే ముందు విద్యార్థులపై క్రూరమైన దాడి గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సభను నేటి(మంగళవారం)కి వాయిదా వేశారు. సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి లోక్‌సభ కార్యక్రమాలు ప్రతి రోజూ వాయిదాపడుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు ఎనిమిది బిల్లులు ప్రవేశపెట్టగా ఆరు బిల్లులు ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదం పొందాయి.

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ "దాదాపు 20 రోజులు గడిచినా సమాధానం చెప్పేందుకు అమిత్ షా పార్లమెంటుకు రాలేదు. చర్చ కోసం ప్రతిపక్షం ప్రవేశపెట్టిన ప్రతి తీర్మానాన్ని తిరస్కరించారు. ఆయన మౌనం పొరపాటు కాదు.. అది హింసకు ఆమోదం తెలపడమే. ఆయన దోషి అయినా అయి ఉండాలి లేదా అసమర్థుడైనా అయి ఉండాలి. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని మేము డిమాండ్ చేస్తున్నాం. ఆయనను జవాబుదారీగా నిలబెట్టే వరకు మా పోరాటం ఆగదు" అని అన్నారు.

# ముస్లిం వివాహాలకు షరియా చట్టమే వర్తిస్తుంది..

**ముస్లిం వివాహాలకు షరియా చట్టమే వర్తింపు**
**కర్ణాటక హైకోర్టు సంచలన తీర్పు**
**నికాహ్ నమోదు చేసినా స్వభావం మారదు**
**విడాకుల పిటిషన్ చెల్లదన్న హైకోర్టు**
**పర్సనల్ లా రద్దు కాదని స్పష్టీకరణ**
**వివాహం కూడా అదే చట్టం కిందే జరగాలి**



ముస్లిం వివాహాల పై కర్ణాటక హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. స్పెషల్ మ్యారేజస్ యాక్ట్ కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నా.. ముస్లిం వివాహాలకు షరియా చట్టమే (హ్యూతీఅఖ్-‌ాఖ్) వర్తిస్తుందని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ డీకే సింగ్, జస్టిస్ టీఎమ్ నదాఫ్ ధర్మాసనం 'సజీద్ పర్వేజ్ వ/ం ఫర్జానా తాజ్' కేసులో ఫ్యామిలీ కోర్టు ఆదేశాలను సమర్థిస్తూ ఈ తీర్పునిచ్చింది. స్పెషల్ మ్యారేజస్ యాక్ట్ కింద విడాకులు కోరుతూ భర్త దాఖలు చేసిన పిటిషన్ చెల్లదని డివిజన్ బెంచ్ స్పష్టంచేసింది. 'నికాహ్'ను స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద నమోదు చేసినంత మాత్రాన వివాహ మూల స్వభావం మారదని పేర్కొన్నది. ముస్లిం పర్సనల్ లా ప్రకారం జరిగిన పెళ్లిళ్లకు షరియా చట్టమే వర్తిస్తుందని తెలిపింది. విదేశీ ప్రయాణాలు/వీసా కోసం స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద పెళ్లి రిజిస్టర్ చేసుకున్నంత మాత్రాన ముస్లిం పర్సనల్ లా రద్దు కాదని తేల్చిచెప్పింది. 'నికాహ్' చేసుకున్న దంపతులు విడాకుల కోసం స్పెషల్ మ్యారేజ్ యాక్ట్‌ను ఆశ్రయించలేరని వెల్లడించింది. వ్యక్తిగత చట్టాల ప్రకారం జరిగిన వివాహాలకు ఆయా మతపరమైన నిబంధనలే వర్తిస్తాయని హైకోర్టు డివిజన్ బెంచ్ తెలిపింది. స్పెషల్ మ్యారేజస్ యాక్ట్ కింద విడాకులు పొందాలంటే.. వివాహం కూడా అదే చట్టం కింద జరిగి ఉండటం తప్పనిసరని పేర్కొన్నది.

# ప్రజల గుండెల్లో 'పెద్ది' శాశ్వతం..

మొదటి తరువాయి

సభ్యులు, సోదరులను పేరుపేరునా పలకరించారు. పెద్ది సతీమణి స్వప్నకు ధైర్యవచనాలు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో మాట్లాడారు. ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదని ఎలా బతికామన్నదే ముఖ్యమని తెలిపారు. పెద్ది అంతిమయాత్రకు లక్షలాదిగా తరలివచ్చిన జనమే ఆయన ప్రజాజీవితానికి నిదర్శనమని పేర్కొన్నారు. పెద్ది గెలిచింది ఒక్కసారే అయినా జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయాడని కొనియాడారు. తెలంగాణ కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పోరాటాలకు నాయకత్వం వహించిన మహోన్నత ప్రజా నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అని కేటీఆర్ గుర్తుచేశారు.

పెద్ది అంతిమ యాత్ర తర్వాత హైదరాబాద్‌లో తనను కలిసిన వారు 'ఆయన మాజీ ముఖ్యమంత్రి కాదు.. పదిసార్లు ఎమ్మెల్యే కాదు. ఎందుకు అన్నా అంతమంది ప్రజలు లక్షలాదిగా తరలివచ్చారు? 12 గంటల పాటు జనయాత్ర జరిగింది?' అని అడిగారని పేర్కొన్నారు. అప్పుడు వారికి పెద్ది సుదర్శన్‌రెడ్డి వరంగల్ జిల్లాలో ఉద్యమానికి నాయకత్వం వహించిన నాయకుడని, అందుకే ఓరుగల్లు మొత్తం కదిలివచ్చి పెద్దన్నను చివరిసారిగా చూసుకున్నదని' అని తాను బదులిచ్చిన విషయాన్ని కేటీఆర్ వివరించారు. 'ఉద్యమ పవర్ అంటే అది అని, ఉద్యమ బిడ్డకు.. ఉద్యమ గడ్డ ఇచ్చిన గౌరవం అది' అని తాను పేర్కొన్నట్టు చెప్పారు.

## స్కూల్ ఫీజుల పెంపు 5 శాతమే..

-బిల్లు ఆమోదించిన పంజాబ్ అసెంబ్లీ



**న్యూఢిల్లీ ఆగస్ట్ 10(జర్నలిస్ట్ డైరీ) :**
పంజాబ్‌లో స్కూల్ ఫీజుల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్కూల్ ఫీజులు 5 శాతం మాత్రమే పెంచేందుకు అనుమతించిన బిల్లును రాష్ట్ర అసెంబ్లీ సోమవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇందుకోసం 'ద పంజాబ్ రెగ్యులేషన్ ఆఫ్ ఫీ ఆఫ్ అన్ ఎయిడెడ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ (అమెండ్‌మెంట్) బిల్, 2026 నేడు ఆమోదం పొందింది. ఈ బిల్లు ప్రకారం రాష్ట్రంలోని అన్ ఎయిడెడ్ స్కూల్స్, ఇతర విద్యా సంస్థలు ప్రతి ఏటా 5 శాతం కంటే ఎక్కువ ఫీజులు పెంచకూడదు.ప్రస్తుతం పంజాబ్‌లోని విధాన సభ (అసెంబ్లీ) వర్షాకాల సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఈ బిల్లును రాష్ట్ర విద్యాశాఖ మంత్రి హర్జోత్ సింగ్ బెయిన్స్ సభలో ప్రవేశపెట్టగా, ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూల్స్ ప్రతి సంవత్సరం 5 శాతం మాత్రమే ఫీజులు పెంచాలి. దీనివల్ల ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రులకు భారీ ఉపశమనం లభిస్తుందని సీఎం భగవంత్ మన్ అన్నారు. ఈ నిర్ణయం అన్ని రకాల ఫీజులకు కలిపి వర్తిస్తుంది. ట్యూషన్ ఫీజులు, డెవలప్‌మెంట్ ఫీజులు, యాన్యువల్ ఛార్జెస్, యాక్టివిటీ ఛార్జెస్, స్మార్ట్ క్లాసెస్, టెక్నాలజీ ఛార్జెస్, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జెస్, ల్యాబ్, లైబ్రరీ ఛార్జెస్, ఎగ్జామినేషన్ ఛార్జెస్ వంటివన్నీ కలిపి ఐదు శాతం మాత్రమే పెంచాలి. ఇతర ఫీజులేవైనా వసూలు చేసినా అవి కూడా ఐదు శాతానికి మించి పెంచకూడదు. ప్రస్తుతం పంజాబ్‌లో 7,800 వరకు ప్రైవేటు స్కూల్స్ ఉన్నాయి. వీటిలో 32 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతి సంవత్సరం విద్యా సంస్థలు ఇష్టారీతిన ఫీజులు పెంచుతుండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటి నుంచి విముక్తి కల్పించేలా ఈ బిల్లును ప్రభుత్వం రూపొందించింది. ఒకవేళ అదనపు ఫీజులు వసూలు చేస్తే వాటిని తిరిగి, యాజమాన్యాల నుంచి వసూలు చేస్తారు. ఈ నిర్ణయం ప్రకారం మూడేళ్ల కాలానికి 15 శాతానికి మించి ఫీజుల పెంపుదల ఉండకూడదు.

## హిమాచల్ ప్రదేశ్‌లో వర్ష బీభత్సం..


– విద్యుత్ సరఫరా నిలిపివేత



**న్యూఢిల్లీ ఆగస్ట్ 10(జర్నలిస్ట్ డైరీ) :**
భారీ వర్షాలతో హిమాచల్ ప్రదేశ్ అతలాకుతలమవుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరాకు అంతాయం ఏర్పడింది. 255 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షానికి మండి జిల్లా అత్యంత తీవ్ర ప్రభావానికి గురైంది. ఇక్కడ 51 రోడ్లు మూసుకుపోవడంతో పాటు భారీ సంఖ్యలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడ్డాయి. కులు, సిమ్లా, చంబా వంటి ఇతర జిల్లాలు కూడా రోడ్లు మూసివేశారు.విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రకృతి ప్రకోపం వల్ల ఇప్పటి వరకు 155 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 68 మంది విపత్తు సంబంధిత కారణాలతో, 87 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. సుమారు రూ. 8,352.62 కోట్ల నష్టం వాటిల్లడంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడింది. పునరావస చర్యలపై అధికారులు దృష్టి సారించారు

## 7.4 తీవ్రతతో కొలంబియాలో భూకంపం..

వెనిజులా సరిహద్దులో ప్రకంపనలు



**బొగోటా ఆగస్ట్ 10(జర్నలిస్ట్ డైరీ) :**
కొలంబియాలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.4 తీవ్రత నమోదైంది. భారీగా భూమి కంపించడంతో ప్రజలు భయాందోళన చెందారు. పలు భవనాలు నేలమట్టమయ్యాయి. ప్రాణ నష్టం కూడా జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. సోమవారం ఉదయం 7.34 గంటల సమయంలో శాన్ జోస్ డెల్ పాల్మార్‌కు తూర్పున సుమారు 5 కిలోమీటర్ల దూరంలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.4గా నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. సుమారు 107 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు పేర్కొంది. వెనిజులా సరిహద్దు ప్రాంతాల్లో కూడా ప్రకంపనల ప్రభావం కనిపించినట్లు వెల్లడించింది.కాగా, కొలంబియాలోని పలు ప్రాంతాల్లో తీవ్ర స్థాయిలో భూమి కంపించింది. దీంతో రోడ్లపై ఉన్న ప్రజలు భయాందోళన చెందారు. క్విబ్డోలో పలు భవనాలు నేలమట్టమయ్యాయి. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో జనం మరణించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. కొలంబియాలో సంభవించిన భూకంప నష్టానికి సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## విదేశీ జర్నలిస్టుల సోషల్ మీడియాపై అమెరికా నిఘా?



**వాషింగ్టన్ ఆగస్ట్ 10(జర్నలిస్ట్ డైరీ) :**
వీసాల కోసం దరఖాస్తు చేసుకునే విదేశీ జర్నలిస్టుల సోషల్ మీడియా ఖాతాలపై నిఘా వేసి ఉంచాలని అమెరికా విదేశాంగ శాఖ యోచిస్తోంది. ఇమ్మిగ్రేషన్, వీసా నిబంధనలను మరింత కఠినతరం చేసేందుకు ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో ఇది కూడా ఓ భాగమే. దేశంలో ప్రవేశించాలని కోరుకునే అంతర్జాతీయ పాత్రికేయులకు ఇది మరో అడ్డంకి కాబోతోంది. పలు వీసా కేటగిరీల కింద దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించేందుకు ఇప్పటికే ఓ కార్యక్రమం అమలులో ఉంది. విదేశీ మీడియా ప్రతినిధులను కూడా చేర్చి ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం విస్తరిస్తోందని రాయిటర్స్ వార్తా సంస్థ తెలియజేసింది. కెనడా, మెక్సికో ఉద్యోగులు ఉపయోగిస్తున్న మరో వీసా కేటగిరీ దరఖాస్తుదారులకు కూడా ఈ కార్యక్రమం వర్తిస్తుంది. ఈ ప్రక్రియను విదేశాంగ శాఖ 'ఆన్‌లైన్ ఉనికి పరిశీలన'గా చెబుతోంది. ప్రవేశం కోరుతున్న విదేశీయులు అమెరికా వీసా అవసరాలను నెరవేరుస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించడమే దీని ఉద్దేశమని వాదించింది. ప్రవేశాలకు సంబంధించిన అమెరికా చట్టాలు, షరతులకు దరఖాస్తుదారులు కట్టుబడి ఉన్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారించుకునేందుకు సాధ్యమైనంత గరిష్ఠ స్థాయిలో విదేశీయులను అధికారులు తనిఖీ చేస్తారని విదేశాంగ శాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు. అమెరికా భద్రత, ప్రజల రక్షణ, దేశ ప్రయోజనాలకు ముప్పు కలిగించే వారిని గుర్తించడమే ఈ ప్రక్రియ ఉద్దేశమని విదేశాంగ శాఖ తెలిపింది.

## హర్మూజ్ జలసంధి మళ్లీ ఉద్రిక్తం..

చమురు ట్యాంకర్‌పై ఇరాన్ క్షిపణి దాడి..!



**న్యూఢిల్లీ ఆగస్ట్ 10(జర్నలిస్ట్ డైరీ) :**
హర్మూజ్ జలసంధి లో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి. ఈ జల సంధిలో చమురు ట్యాంకర్ పై ఇరాన్ క్షిపణి దాడి చేసింది. దాంతో నౌకలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ దాడుల్లో పక్కనే ఉన్న మరో చమురు నౌక కూడా స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.అయితే దాడికి గురైనవి ఏ దేశానికి చెందిన ట్యాంకర్లు, సిబ్బంది ప్రాణాలతో ఉన్నారా లేదా..? అనే వివరాలు తెలియాల్సి ఉంది. కాగా హర్మూజ్ జలసంధిలోని జల మార్గాలపై ఒమన్‌తో అమెరికా చర్చలు జరుపుతున్న వేళ ఈ దాడులు జరగడం గమనార్హం. మరోవైపు దక్షిణ ఇరాన్ గగనతలంలో చక్కర్లు కొడుతున్న అగ్రరాజ్య ఎంక్యూ-9 డ్రోన్‌ను ఐఆర్‌జీసీ దళాలు కూల్చివేశాయని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఇదిలావుంటే సౌదీ అరేబియా-హూతీల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. సౌదీ సైనికులే లక్ష్యంగా ఓడరేవుపై జరిపిన దాడుల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇక అరామ్‌కోకు చెందిన జాజన్ రిఫైనరీపైనా హూతీలు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డారు. ఈ ఘటన కారణంగా చమురుశుద్ధి కేంద్రం వద్ద భారీగా మంటలు చెలరేగాయి. దాంతో ఆ చమురు రిఫైనరీని తాత్కాలికంగా మూసివేశారు.ఈ ఘటనలో ఆస్తి, ప్రాణనష్టం వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ఇటీవల పాకిస్థాన్, టర్కీ, సౌదీ అరేబియా 'మక్కా ఒప్పందం' కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం ఏ ఒక్కదానిపై దాడి జరిగినా దాన్ని మిగిలిన రెండు దేశాలపైనా దాడిగా పరిగణించి కలిసికట్టుగా ఎదురు తిరుగుతారు. ఈ డీల్ కుదుర్చుకున్న కొన్ని రోజుల్లోనే హూతీలు సౌదీపై దాడులు చేయడం గమనార్హం. దాంతో ఇప్పుడు పరిస్థితులు ఏ మలుపు తిరుగుతాయన్న దానిపై ఉత్కంఠ నెలకొన్నది.

# జార్ఖండ్‌లో విద్యార్థులపై లాఠీఛార్జి, టియర్ గ్యాస్ ప్రయోగం..

### ఖండించిన రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ ఆగస్ట్ 10(జర్నలిస్ట్ డైరీ) :**
జార్ఖండ్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులపైకి పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతోపాటు టియర్ గ్యాస్ ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపైకి బలప్రయోగం చేయడం ఏంటని హేమంత్ సోరెన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా గత నెల నుంచి జార్ఖండ్ రాజధాని రాంచీలో విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంతో ఇటీవల పలుమార్లు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. విద్యార్థుల డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించలేదు. దీంతో సోమవారం విద్యార్థుల అసెంబ్లీ ముట్టడికి యత్నించారు.ఈ క్రమంలో విద్యార్థులపైకి పోలీసులు లాఠీఛార్జి చేశారు. టియర్



గ్యాస్, వాటర్ కెనాన్లు ప్రయోగించారు. దీనిపై రాహుల్ గాంధీ సోమవారం మీడియాతో మాట్లాడారు. విద్యార్థులకు నిరసన తెలియజేసి, ఆందోళన నిర్వహించే హక్కు ఉందని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై బలగాల్ని ప్రయోగించడం ఏంటని రాహుల్ ప్రశ్నించారు. చర్చల ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వానికి సూచించారు. విద్యార్థుల ఆందోళనని ప్రభుత్వం అర్థం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. జార్ఖండ్ ప్రభుత్వంలో కాంగ్రెస్ కూడా భాగస్వామిగా ఉండటం విశేషం. అక్కడ జేఎంఎం, ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు కలిసి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. అయితే, అత్యధిక సీట్లు కలిగిన జేఎంఎం ఆధ్వర్యంలోనే ప్రభుత్వం కొనసాగుతోంది. కూటమిలో ఉన్నప్పటికీ రాహుల్ ప్రభుత్వ తీరును తప్పుబట్టడం విశేషం. మరోవైపు ఢిల్లీలో సీజేపీ ఆందోళనకారులపై జరిగిన దాడి విషయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై రాహుల్ విమర్శలు చేశారు. విద్యార్థులపై దాడి చేయమని అమిత్ షా ఆదేశించారా లేదా అని ప్రశ్నించారు. ఈ విషయంలో అమిత్ షా సమాధానం చెప్పాలన్నారు. విద్యార్థులపై దాడి జరిగిన తర్వాత నుంచి అమిత్ షా పార్లమెంట్‌కు రావడం మానేశారు. దీనిపై కూడా రాహుల్ ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీతోపాటు అమిత్ షా కూడా 15 రోజులుగా సభకు ఎందుకు రావడం లేదని రాహుల్ ప్రశ్నించారు. సభకు రావడానికి ధైర్యం లేదా అంటూ నిలదీశారు.

# శాంతి ప్రణాళికను అంగీకరించం

### ఆయుధాల అప్పగింత తర్వాతే సేనల ఉపసంహరణ
### ట్రంప్ నెత్తిన బాంబు పేల్చిన నెతన్యాహూ

**టెల్ అవీవ్ ఆగస్ట్ 10(జర్నలిస్ట్ డైరీ) :**
గాజా శాంతి ప్రణాళికను అంగీకరించే ప్రశ్నే లేదని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ స్పష్టం చేశారు. గాజాలో కాల్పుల విరమణ కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదిహేను సూత్రాల ప్రణాళికను రూపొందించిన విషయం తెలిసిందే. ఆదివారం జరిగిన ఇజ్రాయిల్ క్యాబినెట్ సమావేశంలో నెతన్యాహూ ప్రసంగిస్తూ 'నేను ఓ విషయాన్ని స్పష్టంగా చెప్పదలచుకున్నాను. పదిహేను సూత్రాల పత్రాన్ని ఇజ్రాయిల్ అంగీకరించదు' అని అన్నారు. ఆయన రెండోసారి కూడా ఇదే విషయాన్ని కుండబద్దలు కొట్టారు. 'నేను అలా చెప్పలేదని కొందరు అనడం విన్నాను. అందుకే ఇప్పుడు మరోసారి చెబుతున్నా. గాజా శాంతి ప్రణాళికను ఇజ్రాయిల్ అంగీకరించబోదు' అని చెప్పారు. కాగా నెతన్యాహూ నిర్ణయం ట్రంప్‌ను అసహనానికి గురి చేసే అవకాశం ఉన్నదని పరిశీలకులు అభిప్రాయపడ్డారు.

వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరలించేందుకే...
ఇరాన్ విషయంలో ఎదురు దెబ్బలు తగిలిన నేపథ్యంలో దాని నుంచి ప్రజల దృష్టిని మరలించేందుకు పది రోజుల క్రితం ట్రంప్ ఓ ప్రకటన చేశారు. హమాస్‌కు, తాను ఏర్పాటు చేసిన శాంతి బోర్డుకు మధ్య చారిత్రక ఒప్పందం కుదిరిందని తెలిపారు. దీని ప్రకారం హమాస్ తన



వద్ద ఉన్న ఆయుధాలను పూర్తిగా విడనాడుతుందని చెప్పారు. అదే సమయంలో శాంతి బోర్డు ప్రతినిధి నికోలే మ్లాడెనోవ్ మరో అడుగు ముందుకు వేసి గాజా నుంచి ఇజ్రాయిల్ దళాలు కూడా వైదొలుతాయని అన్నారు. హమాస్ తన వద్ద ఉన్న ఆయుధాలను అప్పగిస్తున్న సమయంలోనే ఇజ్రాయిల్ రక్షణ దళాలు గాజాలోని తమ స్థానాల నుంచి దశల వారీగా వెనక్కి తగ్గుతాయని వివరించారు.

ఆయుధాలను పూర్తిగా విడనాడితేనే దళాల ఉపసంహరణ
గాజా నుంచి దళాల ఉపసంహరణకు ఇజ్రాయిల్‌ను ఒప్పించగలమన్న అమెరికా ఆశలు నెతన్యాహూ తాజా ప్రకటనతో అడియాసలయ్యాయి. 'హమాస్ తన వద్ద ఉన్న ఆయుధాలను పూర్తిగా అప్పగించే వరకూ ఇజ్రాయిల్ రక్షణ దళాల ఉపసంహరణ జరగదు. హమాస్‌ను నిరాయుధీకరించడం అంటే దాని వద్ద భారీ ఆయుధాలు, తేలికపాటి ఆయుధాలు సహా అన్ని రకాల ఆయుధాలు లేకుండా చేయడమే. మనం మాట్లాడుతున్నది నిజమైన నిరాయుధీకరణ గురించి. కల్పితమైన దాని గురించి కాదు' అని క్యాబినెట్ భేటీలో నెతన్యాహూ తేల్చి చెప్పారు. కాగా నెతన్యాహూ ప్రకటనపై హమాస్ ఆచితూచి స్పందించింది. కార్యాచరణ ప్రణాళికకు తాము కట్టుబడి ఉన్నామని, ఇజ్రాయిల్ కూడా ఇదే వైఖరిని అవలంబించేలా నెతన్యాహూపై శాంతి బోర్డు ఒత్తిడి తెస్తుందని ఆశిస్తున్నామని తెలిపింది.

అతివాద మిత్రుల నుంచి అవరోధాలు
ఇజ్రాయిల్‌లో సుమారు మూడు నెలల వ్యవధిలో సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆ ఎన్నికలలో నెతన్యాహూకు ఎదురు దెబ్బలు తప్పవని పలు పోల్స్ సూచిస్తున్నాయి. ఇజ్రాయిల్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు నెతన్యాహూ కొన్ని పార్టీలతో కూటమిని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల తర్వాత కూటమిని ఏర్పాటు చేసే కంటే ముందుగానే దానికి ఓ రూపం ఇచ్చి బరిలో దిగడం మంచిదని ఆయన భావిస్తున్నారు. ఫలితాలు వెలువడిన తర్వాత అధికారంలో కొనసాగే అవకాశం ఏ మాత్రం ఉన్నప్పటికీ ఆయనకు అతివాద మిత్రుల మద్దతు తప్పనిసరి అవుతుంది. అయితే గాజా కార్యాచరణ ప్రణాళికలపై అతివాదులు ఇప్పటికే బహిరంగ విమర్శలు చేశారు. అంతేకాదు...గాజాలో ఓ చిన్న పైలట్ ప్రాజెక్టులో భద్రతను పర్యవేక్షించడానికి అంతర్జాతీయ స్థిరీకరణ దళాలను మోహరించాలంటూ క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని కూడా వారు డిమాండ్ చేస్తున్నారు. పైలట్ ప్రాంతంలో పునర్నిర్మాణ పనులను ప్రారంభించడానికి నెతన్యాహూ రహస్యంగా ఆమోదం తెలిపారని, ఇది మరింత బలహీనమైన చర్య అని ఆర్మీ రేడియో వ్యాఖ్యానించింది.

## 5 లక్షల పొదుపు చెదలపాలు

### రాజస్థాన్ రైతుకు చేదు అనుభవం

**జైపూర్:ఆగస్ట్ 10(జర్నలిస్ట్ డైరీ) :**
రాజస్థాన్‌కు చెందిన ఒక రైతు తన దగ్గరున్న ఐదు లక్షల రూపాయల పొదుపు సొమ్ము దొంగల బారిన పడకుండా కాపాడుకునేందుకు తన పొలంలో పాతిపెట్టి దాచుకున్నాడు. ఏడాది క్రితం అతనికి చెందిన భూమిని విక్రయించగా వచ్చిన ఐదు లక్షల



రూపాయలతో ఇంటిని నిర్మించుకోవాలనుకున్నాడు. అయితే ఆ నగదు చోరీ అవుతుందనే భయంతో ఒక పాలిథిన్ కవర్‌లో పెట్టి, తన పొలంలో గుంత తవ్వి దానిలో దాచిపెట్టాడు. అయితే అతనికున్న మద్యం అలవాటు, మతిమరపు కారణంగా డబ్బు ఎక్కడ దాచిపెట్టాడో మరచిపోయాడు. అయినప్పటికీ చాలా చోట్ల తవ్వి చూశాడు. డబ్బు దొరకకపోవడంతో భార్యకు, కుమారులకు విషయం చెప్పాడు. దీంతో వారంతా ఆ నగదు కోసం పొలంలో పలు చోట్ల తవ్వారు. అయినా ఫలితం లేకపోయింది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# చేగురు లో ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న హోటళ్లు, కానరాని ఫుడ్ ఇన్స్పెక్టర్ జాడ..!

**-మళ్లీ మళ్లీ మరిగిస్తున్న నూనెలు.. రోగాల బారిన పడుతున్న బాటసారులు**

**-అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించాలని డిమాండ్**

**-చౌరస్తా కహానీ హోటల్‌లో టిఫిన్ నాణ్యతపై కస్టమర్ ఆగ్రహం**

**-ఆయిల్ మార్చితే రూ.200 ప్లేట్ పూరీ.. వాడిన ఆయిల్ అయితే రూ.40 అంటూ నిర్వాహకుడి సమాధానం**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండల పరిధి చెగూర్ గ్రామ శివారులో ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న చౌరస్తా కహానీ హోటల్‌లో సోమవారం నాడు టిఫిన్ నాణ్యతపై కస్టమర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హోటల్‌లో పూరీ వడ బొండం టిఫిన్ ల నాణ్యతపై ఓ కస్టమర్ ప్రశ్నించగా, హోటల్ నిర్వాహకుడు ఇచ్చిన సమాధానం మరింత చర్చకు దారితీసింది. కస్టమర్ ప్రశ్నకు స్పందిస్తూ “ఆయిల్ చేంజ్ చేస్తే ప్లేట్ పూరీ రూ. 200.. వాడిన ఆయిల్ అయితే రూ. 40” అంటూ నిర్వాహకుడు చెప్పినట్లు సమాచారం. అయితే ఆ సమాధానం కస్టమర్ అడిగిన ప్రశ్నకు పొంతన లేకుండా ఉందని పలువురు పేర్కొంటున్నారు. హోటల్‌లో టిఫిన్ తయారీలో ఉపయోగించే నూనె నాణ్యత, ఆహార పదార్థాల నాణ్యతపై కస్టమర్లు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధరకు టిఫిన్ అందించాలనే ఉద్దేశంతో నాణ్యత విషయంలో రాజీ పడుతున్నారా...? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కస్టమర్లకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాల్సిన బాధ్యత హోటల్ నిర్వాహకులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.
కొన్ని హోటళ్లలో వంట నూనెను పదేపదే ఉపయోగించడం వల్ల ఆహార నాణ్యత దెబ్బతినడమే కాకుండా, వినియోగదారుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు హోటళ్లలో ధరలు మాత్రం ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, నాణ్యత లేని ఆహార పదార్థాలు, కల్తీ నూనెల వినియోగాన్ని అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఆహార భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మణికొండ శ్రీ నల్లపోచమ్మ తల్లి దేవాలయంలో ఘనంగా బోనాల ఉత్సవం

**- ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 10 (జర్నలిస్ట్ డైరీ) :** మణికొండలోని శ్రీ నల్లపోచమ్మ తల్లి దేవాలయంలో బోనాల పండుగ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బ్రహ్మానందం చారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర స్పోక్స్ పర్సన్ అండ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బోనాల ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సెక్రటేరియట్ ఉద్యోగి, ఆత్మీయ బంధువు నరేష్ చారి చురుకైన పాత్ర పోషించారు. ఉత్సవాలకు విచ్చేసిన పెద్దలను, ప్రముఖులను ఆత్మీయంగా సత్కరిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తనవంతు సహకారం అందించారు. సేవాభావంతో, అందరినీ కలుపుకొని ముందుకు సాగిన నరేష్ చారి తీరు పలువురికి ప్రేరణగా నిలిచింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు బ్రహ్మానందం చారి మాట్లాడుతూ బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్లు రమణా రెడ్డి, భాస్కర్, సత్యనారాయణ రెడ్డి, అలాగే భరత్, శరత్ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం నేడు కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నా జయప్రదం చేయండి

**- షాద్ నగర్ నియోజకవర్గం, కొత్తూరు మండలం సిద్దాపూర్ మరియు చుట్టుపక్కల గ్రామాల, లంబాడి తండాల ప్రజలందరికీ సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు!**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ)** సిద్దాపూర్‌లో “ఎకో” పేరుతో చెత్త కంపెనీ ఏర్పాటు చేసే ప్రయత్నాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం. ఇది కేవలం ఒక గ్రామం సమస్య కాదు షాద్ నగర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సమస్య మన భూమి, మన వ్యవసాయం, మన పర్యావరణం, మన నీరు, మన రాబోయే తరాల భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న. ఈరోజు మనం మౌనంగా ఉంటే, రేపు మన పిల్లలు దాని మూల్యం చెల్లించాల్సి వస్తుంది. అందుకే ప్రతి గ్రామం నుంచి ప్రతి ఒక్కరూ కదిలి రావాలి. రైతులు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు పార్టీలకు అతీతంగా అందరూ ఒక్కటై మన ప్రజా శక్తిని ప్రభుత్వానికి చూపిద్దాం. ప్రజల అభిప్రాయాన్ని, మన గ్రామాల భవిష్యత్తును పక్కన పెట్టి ఏ నిర్ణయం తీసుకున్నా మనం ప్రశ్నిస్తాం, ప్రజాస్వామ్య పద్ధతిలో గట్టిగా వ్యతిరేకిస్తాం. కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆగస్టు 11 మంగళవారం ఉదయం 9:30 గంటలకు జరిగే మహా ధర్నాకు భారీ సంఖ్యలో తరలివచ్చి మన ఐక్యతను చాటాలని జెయేసీ చైర్మన్ రాంబాల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్ కోరారు . ఇది ఎవరో ఒక్కరి పోరాటం కాదు సిద్దాపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల, తండాల ప్రతి ఇంటి పోరాటం. మన ఊరు కోసం... మన భూమి కోసం... మన భవిష్యత్తు కోసం... ఇప్పుడే ఒక్కటవుదాం! సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ జీవో 641 రద్దు అయ్యే వరకు కలసికట్టుగా పోరాడుదాం!!
“చెత్త కంపెనీ వద్దు --- సిద్దాపూర్‌కు రక్షణ కావాలి!”
“మన భూమి --- మన హక్కు! మన ఊరు --- మన బాధ్యత!”మహా ధర్నాకు ప్రతి ఒక్కరూ తప్పక తరలిరండి! ప్రయాణం ఎక్కడ మొదలైనాగానీ... గమ్యం మాత్రం కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం! అని పిలుపునిచ్చారు.

# అయ్యవారిపల్లిలో బీఆర్ఎస్‌కు జోష్...

**- కాంగ్రెస్ నాయకులు గులాబీ గూటికి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ)** ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరింది. గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు శివ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రుస్తుం, నర్సింలు, లింగం, చందు, రమేష్, శివ, నందు, ప్రసాద్, ఆకాష్, వినయ్, రాకీ, హరీష్, నరేష్, చింటూ, యశ్వంత్, శ్రీకాంత్ తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణకు ఈ చేరికలే నిదర్శనమని అన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకత్వంపై నమ్మకంతో పార్టీలో చేరుతున్నామని, పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని నూతనంగా చేరిన నాయకులు పేర్కొన్నారు. దీంతో అయ్యవారిపల్లిలో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

# సాయిబాబా కాలనీలో ఘనంగా ఆషాఢ మాసం బోనాలు

**- ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ 6వ వార్డు పరిధిలోని సాయిబాబా కాలనీలో ఆషాఢ మాసం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ రాజు నాయక్, శివ ఎస్పీ, కొప్పునూరి ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు లత శ్రీశైలం గౌడ్, సభ్యుడు సయ్యద్ ఖదీర్, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి, ముబారక్ అలీ ఖాన్, సాదిక్, అనిల్ కుమార్, జయప్రకాష్, రాయికల్ శ్రీనివాస్, కరుణాకర్, బుచ్చయ్య, శ్రీధర్ రెడ్డి, కుమారస్వామి గౌడ్, రమేష్, సీతారాం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సాయిబాబా కాలనీ వాసులు శ్రీనివాస్, కిరణ్, ప్రభాకర్ రావు, మహదేవన్ అయ్యగారు, వెంకన్న బాబు, అమర్‌నాథ్ రెడ్డి, బెనూరి చంద్రయ్య, మంగ శంకర్, సిద్ధార్థ, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీను, అనిల్ తదితరులు పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు. బోనాల సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# సమృద్ధిగా వర్షాలు కురవాలని నాగార్జునసాగర్ విజయ విహార్‌లో ఘనంగా వరుణ యాగం





**తెలంగాణ బ్యూరో, ఆగస్టు 10 (జర్నలిస్ట్ డైరీ):** తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్ విజయ విహార్‌లో వరుణ యాగం నిర్వహించారు.
ఇరిగేషన్, సివిల్ సప్లైస్ శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ శ్రీ వీర్లపల్లి శంకర్ గారు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకృతి కరుణించి మంచి వర్షాలు కురిసి రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు ఆకాంక్షించారు.

## పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**-నీట్ పరీక్షలో వైష్ణవి,రక్షిత మరియు ఎంసెట్ లో వై.ఆదిత్యల అత్యుత్తమ ప్రతిభ**

**- వైష్ణవి,రక్షితలకు ఆర్థిక సహాయం అందచేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ) :** పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించి,ఘనంగా సన్మానించారు.నీట్ (చీజుజు) పరీక్షలో కేశంపేట మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన వైష్ణవి,రక్షిత అత్యుత్తమ ర్యాంకులు సాధించగా..షాద్‌నగర్ పట్టణంలోని ఆఫీసర్స్ కాలనీకి చెందిన వై.ఆదిత్య ఎంసెట్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి విద్యార్థుల ప్రతిభను కొనియాడారు.గ్రామీణ నేపథ్యం నుండి వచ్చి,కష్టపడి చదివి మంచి మార్కులు సాధించిన వైష్ణవి,రక్షితలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.వైష్ణవి,రక్షితల ఉన్నత చదువులకు ఉపయోగపడేలా,తన వంతు బాధ్యతగా వారికి కొంత ఆర్థిక సహాయాన్ని కూడా అందజేశారు.విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజానికి సేవ చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఇప్పలపల్లి సర్పంచ్ మంద మంజుల జంగయ్య పోమాల్ పపల్లి స్వప్న భూపాల్ రెడ్డి,తుర్పుగడ్డ తండా సర్పంచ్ థౌర్య,మాజీ కౌన్సిలర్లు చెట్ల నర్సిమ, యుగేందర్,మాజీ సర్పంచులు యాదవ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,యారం శేఖర్ రెడ్డి,ఆంజనేయులు యాదవ్,మధు,ఇప్పలపల్లి ఉపసర్పంచ్ సహాదేవ్,మాజీ ఎంపిటిసి రాధాకృష్ణ,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ శ్రీను,విద్యార్థుల తల్లితండ్రులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సోమవారి కుటుంబ సభ్యుల గోరింటాకు మహోత్సవం..



**యాచారం (ఆగస్ట్ 10).జర్నలిస్ట్ డైరీ..** సోమవారి కుటుంబ సభ్యులు నిర్వహించిన గోరింటాకు మహోత్సవం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. కొత్తపల్లి లోని సోమ సత్యనారాయణ గుప్త వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుటుంబంలోని కోడళ్ళు, కూతుళ్లు, మనవరాళ్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.ఆషాఢ మాసం సందర్భంగా ప్రతి సంవత్సరం ఈ గోరింటాకు మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ వేడుక ద్వారా కుటుంబ సభ్యుల మధ్య ఆప్యాయత, అనురాగం, ప్రేమ మరింత బలపడటంతో పాటు కుటుంబ ఐక్యత కొనసాగుతుందని వారు పేర్కొన్నారు.కుటుంబ సభ్యులందరూ ఒకేచోట చేరి ఆప్యాయతలను పంచుకుంటూ గోరింటాకు వేడుకను ఆనందంగా జరుపుకున్నారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఆటలు, పాటలు, సరదా కార్యక్రమాలతో వేడుక ఉత్సాహంగా కొనసాగింది.
ఈ వేడుకలో సోమలక్ష్మి,మునుగోటి లక్ష్మి సోమా,శైలజ కర్నాటి పద్మ కర్ణాటక స్రవంతి ముచ్చర్ల శ్రీలత సోమా రూప,మా శెట్టి మానస తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ పట్టణంలోని సాయిబాబా కాలని,రామ్ నగర్ కాలనీలలో బోనాలు

**- పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజాలు నిర్వహించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ):** షాద్ నగర్ పట్టణంలోని సాయిబాబా కాలనీ,రామ్ నగర్ కాలనీలలో కొలువై ఉన్న పోచమ్మ,అమ్మవారి ఆలయాలలో బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి.ఈ వేడుకల్లో భాగంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అమ్మవార్ల ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ..కాలనీ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలత, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు.పట్టణంలోని ప్రతి ఇల్లూ సంతోషాలతో విలసిల్లాలని,ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వాని పాండురంగ రెడ్డి, అనిత రఘునాథ యాదవ్, ఎస్పీ శివ,రాజు నాయక్, సీనియర్ నాయకులు రాయికల్ వెంకటరెడ్డి,మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్,కంటెస్టెంట్ కౌన్సిలర్ రాజేందర్ సింగ్, సర్పంచులు నాగిళ్ల వెంకట వెంకట్,స్వప్న భూపాల్ రెడ్డి,మాజీ సర్పంచులు తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,యారం శేఖర్ రెడ్డి,కాలనీవాసులు నాయుకులు చాట్ల రమేష్, జయంత్ రెడ్డి, సాయిప్రసాద్,అల్లాడ శేఖర్, కోమరేష్,హర్షవర్ధన్ రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లింగందాన గ్రామ రైతునలను పరామర్శించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి


**-ప్రమాదవశాత్తు గడ్డివాములు తగలబడడంతో నష్టపోయిన రైతులు**

**-రైతులకు ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ) :** కేశంపేట మండల పరిధిలోని లింగందన్న గ్రామంలో ప్రమాదవశాత్తు గడ్డివాములు తగలబడి తీవ్రంగా నష్టపోయిన నాగిళ్ళ క్రిష్ణ,నాగిళ్ళ నర్సిమ,నాగిళ్ల జంగయ్య తదితర రైతులకు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అండగా నిలిచారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి గ్రామాన్ని సందర్శించి, బాధితులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును,నష్టపోయిన వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కష్టాల్లో ఉన్న రైతు కుటుంబాలకు తన వంతు సహాయంగా తక్షణ ఆర్థిక సాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో లింగధన సర్పంచ్ నాగిళ్ళ వెంకట్,ఇప్పలపల్లి సర్పంచ్ మంద మంజుల జంగయ్య,పోమాల్ పల్లి స్వప్న భూపాల్ రెడ్డి,తుపుగడ్డ తండా సర్పంచ్ థౌర్య,మాజీ సర్పంచులు తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,యారం శేఖర్ రెడ్డి,ఆంజనేయులు యాదవ్,క్రిష్ణయ్య,మధుసుదన్ గౌడ్ ,మాజీ ఎంపిటిసి యాదయ్య,బీఆర్ఎస్ నాయకులు రామ్ రెడ్డి,సుదర్శన్ గుప్త, తిరిపతి,సహదేవ్,భైర్కాన్ పల్లి సర్పంచ్ తనయుడు శివ యాదవ్,ఉప సర్పంచ్ మధు సుధన్ గౌడ్, సుదర్శన్ గుప్త,చిన్న రామస్వామి, కృష్ణయ్య, జంగయ్య నర్సింలు,గుత్తి పండు సుకుమార్ రెడ్డి, గోపాల్ గౌడ్ బాలావామి మంగలి శ్రీను, భరత్,సతీష్ హరీష్ అంజయ్య, శ్రీశైలంయువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఒడిశా నుండి నగరానికి గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు అంతరాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు. 6 కిల్లో గంజాయి స్వాధీనం..



**ఎల్బీనగర్: ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ)** ఒడిశా నుండి హైదరాబాద్ కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఓ మహిళతో మరో ఇద్దరిని ఎల్బీనగర్ పోలీస్, తెలంగాణ యాంటి నార్కోటిక్స్ బ్యూరో పోలీసులు ఆరెస్టు చేసి వారి వద్ద నుండి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్ గఢ్, బస్తర్ జిల్లా, కుకనార్కు చెందిన సునీత నాగ్(30) అదే ప్రాంతానికి చెందిన పాజ్జ దిర్ధా(26) ఇద్దరు కలిసి గంజాయి సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో సునీత నాగ్ ఒడిశాలోని మల్కనగిరి జిల్లా పులాపల్లికి చెందిన లాబన్ అనే వ్యక్తి వద్ద కిలో రూ. 3500 చొప్పున గంజాయిని కొనుగోలు చేసుకుంది. సునిత తన సహచరుడు పొజ్జ దీరోతో సుక్మా నుండి భద్రాచాలానికి ఆటోలో చేరుకుని అక్కడ నుండి బస్సులో హైదారాబాద్కు చేరుకున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా, వంగూరు మండలం. అన్నారం గ్రామంకు చెందిన మంచాల రాజేష్ (27) పెయింటర్ పనిచేస్తున్నాడు. గంజాయిని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలల్లో / విక్రయిస్తుంటాడు. సోమవారం తెల్లవారు జామున ఎల్బీనగర్ లో బస్సు దిగిన సునీత నాగ్. పొజ్జ దిర్ధాలు కలిసి రాజేష్కు గంజాయిని ఇచ్చేందుకు వెళ్తున్నారు. అప్పటికే అక్కడ వేచ్చి ఉన్న పోలీసులు ముగ్గురిని రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. వారి వద్ద నుండి 6 కిల్లో గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. నిందితులు తెచ్చిన గంజాయిని నగరంలో వివిధ ప్రాంతాల్లో కిలో 14 వేలకు విక్రయించేందుకు ప్రణాళిక వేసుకున్నట్లు ఎల్బీనగర్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు

## కేంద్ర ప్రభుత్వం సార్వత్రిక విద్య ఆరోగ్యం అందుబాటులోకి తేవాలి

**- ఎమ్మెల్సీ నెల్లికంటిసత్యం**



**నాంపల్లి:ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ)** నాంపల్లి మండల కేంద్రంలో సిపిఐ ప్రజా చైతన్య యాత్ర వచ్చిన సందర్భంగా ఎమ్మెల్సీ హాజరై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు పూలమాలలు వేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వ్యతిరేకిస్తూ మండలంలోని 32 గ్రామపంచాయతీలలో సిపిఐ పార్టీ ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. అనంతరం తుమ్మలపల్లి గ్రామస్తులను సిపిఐ పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక వ విధానాలను ఎండగట్టేందుకు ఆగస్టు 6 నుండి 14 వరకు నల్లగొండ జిల్లాల్లో జరుగు ప్రజా చైతన్య ప్రచార యాత్ర జయప్రదం చేయండి.అని పిలుపునిచ్చారు. అదేవిధంగా సెప్టెంబర్ 1న చలో ఢిల్లీకి తరలిరావాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినేటికీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. వారు ఎన్నికల సందర్భంగా దేశాన్ని అభివృద్ధి పదము వైపు తీసుకెళ్తామని, ఉపాధి, సంక్షేమం, స్వ పరి పాలన మెరుగైన భవిష్యత్తును అందిస్తామని వాగ్దానం చేసింది కానీ ఒక్క సమస్యను పరిష్కరించకపోగా నిరుద్యోగం పెరుగుతుంది వస్తువుల ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అంటుతున్నాయి. దేశ జనాభాలో నూటికి 60% శాతం పైగా వ్యవసాయం మీదనే ఆధారపడి జీవనాధారం గడుపుతు ఉన్నారు. రైతులు పెట్టుబడి ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా రైతులు సుదీర్ఘ పోరాటాలు చేసినప్పటికీ కనీస ధర (ఎంఎస్పి)కి చట్టపరమైన డిమాండ్ ఇంకా పరిష్కారం కాలేదు. చారిత్రాత్మక రైతు ఉద్యమం తర్వాతే బిజెపి ప్రభుత్వం వివాద స్పధ వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకుంది. రైతులకు కావాల్సింది పంటలు కొనుగోలు తక్కువ వడ్డీకి రుణాలు నీటిపారుదల వసతులు, మరియు లాభసాటి ధరలు మాత్రమే కల్పించి ఆదుకోవాల్సిన అవసరం ఉన్నది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై పెనుబారం మోపుతుంది అని మండిపడ్డారు. సిపిఐ పార్టీ డిమాండ్స్, సార్వత్రిక విద్యా ఆరోగ్యం అందుబాటులోకి తేవాలి, పంటలకు కనీసం మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి, ప్రతి ఒక్కడికి ఉద్యోగం కల్పించాలి, మహిళా రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలి, కార్మికుల హక్కులను పరిరక్షించాలి, ఎస్ ఎల్ బి సి ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే పూర్తి చేయాలి, పేద బడుగు బలహీన వర్గాలకు ఇడ్లు ఇవ్వాలి ఉపాధి పనులను కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం ఈ హామీలను నెరవేర్చని ఎడల బిజెపి ప్రభుత్వాన్ని గద్దెధింపెంత వరకు ఉద్యమాలు నడుపుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్య చారి, మండల కార్యదర్శి నే తాళ్ల రాజు, ప్రజానాట్యమండలి అధ్యక్ష కార్యదర్శులు చెల్లం పాండురంగారావు, జనం పాట జగన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ, మండల కార్యవర్గ సభ్యులు, ఊరి పాక వెంకటయ్య, పల్లె సైదులు, కోరేసత్తయ్య, నేరెళ్ల సైదులు, గిరి స్వామి,రేవెల్లి సర్పంచ్ బట్టు శ్రీను, కానుగుల మహేష్,మోగుదాల సైదమ్మ,బుషిపాక యాదయ్య ఉప సర్పంచ్,రేవెల్లి ఉప సర్పంచ్ వంగూరి సాయిలు,పల్లేటి దశరథ, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చెన్నోజు వెంకటాచారి, సిపిఐ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## యోగా గురువులకు ఘన సన్మానం



**మందమర్రి, ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ)** రిటైర్మెంట్ కార్మికులకు గత మూడు నెలలుగా యోగాను నేర్పించిన యోగ గురువు కొంపల్లి రమేష్ కుమార్ ను బర్ల సదానందమును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఏరియా జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ.. యోగాన్ని ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని ప్రతిరోజు యోగా చేయాలని అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని సూచించారు. రిటైర్మెంట్ కార్మికులకు యోగ నేర్పించడంలో కొంపల్లి రమేష్ గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఏం ఆశించకుండా ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా కార్మికులకు ప్రతిరోజు ఉదయం సాయంత్రం యోగ క్లాసులు నేర్పించడం ఆయన మంచితనానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యోగా గురువు ముల్కల శంకర్, మరియు యోగా మహిళా సభ్యులు, పదవి విరమణ కార్మికులు,తదితరులు, పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# క్విట్ ఇండియా స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడాలి





నల్గొండ ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ)
సీఐటీయూ జిల్లా సహాయ కార్యాదర్శి నల్లా వెంకటయ్య దేవరకొండ మండల పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి జాతీయ రహదారి పై నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్లా వెంకటయ్య మాట్లాడుతూ...బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడం కోసం క్విట్ ఇండియా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పోరాడాలని అన్నారు.క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో,ఎందరో పోరాట యోధుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న దేశ స్వాతంత్రాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలపై కార్మిక వర్గం రైతాంగం ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు.నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో రైతాంగం కార్మికులు ప్రజలు జైలు బరోలో పాల్గొనాలని కోరారు.గత 12వ సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం రైతాంగం ప్రజల హక్కుల్ని కాలరాసే విధంగా పాలన కొనసాగిస్తుందని విమర్శించారు.నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మిక హక్కులు కాల రాశారని విద్యుత్ సవరణ చట్టం, విత్తన చట్టంతో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి విబిజి రాంజీ పేరుతో కొత్త పథకాన్ని తెచ్చి 30 కోట్ల మంది వ్యవసాయ కార్మికుల బతుకులను నాశనం.చూస్తున్నారని విమర్శించారు. దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలకు సంపద సృష్టించే కార్మిక వర్గానికి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను మోసం చేస్తూ ప్రజా కంటకంగా మారిన మోడీపై ప్రజలందరూ యుద్ధం ప్రకటించాలని కోరారు. స్కీం వర్కర్లని పర్మినెంట్ చేయాలని ఆశ వర్కర్స్ కనీస వేతనం 26,000 నిర్ణయించాలని ఫిక్స్ వేతనం నిర్ణయించాలని గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు వివోఏ లకు సెల్ఫ్ నుండి వేతనం ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అదేవిధంగా మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యల పరిష్కరించి కార్మికులకు కనీస వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు స్కావెంజర్లలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రతి కార్మికునికి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు రానున్న రోజుల్లో ఐక్య ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో బిజిలి లింగయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బుడిగ వెంకటేష్,ముత్యాలు,నర్సింహా,బిక్షపతి, యాదయ్య, సాయి శ్రీకాంత్, రాంబాబు శ్రీను, జంగయ్య, సురేష్, తరమ్మా, ముత్తమ్మ, అరవింద, విజయ లక్ష్మి, మల్లమ్మ, జయమ్మ,మార్తామ్మ తదితరులు పాల్గొన్నారు


# కృష్ణమ్మ పరవళ్లు. రైతుల కళ్లలో కన్నీళ్లు

**-నీళ్లు ఉన్నా పంటలకు అందవు**
**- కాంగ్రెస్ పాలనపై బీజేపీ నాయకులు ధ్వజం**
**-బిజెపి నాయకులు కురువ**
**-చిన్న మల్లయ్య తీవ్ర విమర్శలు**



వనపర్తి జిల్లా ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ)
చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో జూరాల ఆయకట్టు రైతులకు జూరాల నీరు విడుదల చేయాలి, లేకపోతే చిన్నమారూర్‌లో లిఫ్ట్ ఇరిగేషన్ దగ్గర జలదీక్ష కార్యక్రమం బిజెపి పార్టీ ఆధ్వర్యంలో చేస్తామని బిజెపి పార్టీ నాయకులు హెచ్చరించారు. కృష్ణానది పరవళ్లు తొక్కుతున్నా చిన్నంబావి మండల రైతుల పొలాలకు మాత్రం సాగునీరు అందడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకులు కురువ చిన్న మల్లయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఒకవైపు కృష్ణమ్మలో నీరు సమృద్ధిగా ఉంటే.. మరోవైపు రైతులు బోర్లకు కిరాయిలు చెల్లించి పంటలను కాపాడుకునే దుస్థితి ఎందుకు వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నీళ్లు ఉన్నాయి, పంప్‌హౌస్‌లు ఉన్నాయి, కాలువలు ఉన్నాయి, కానీ రైతుల పొలాలకు నీళ్లు మాత్రం రావడం లేదు. మరి ఈ ప్రభుత్వంలో నీళ్లు ఎక్కడికి వెళ్తున్నాయి. అంటూ మల్లయ్య ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రచారం ఘనం పొలాల్లో నీరు శూన్యం. ఫేజ్--1 పంప్‌హౌస్‌కు నీళ్లు వచ్చాయని కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉందని విమర్శించారు. పెద్దమారూర్, చిన్నమారూర్ ప్రాంతాలకు కాలువ ద్వారా సక్రమంగా నీరు అందిస్తే రెండు మోటార్లతోనే సుమారు 15 క్యూసెక్కుల నీరు అందే అవకాశం ఉందన్నారు. నాలుగు పెద్ద మోటార్లు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే మరింత ఎక్కువ నీటిని తరలించే అవకాశం ఉన్నప్పటికీ, రైతులకు మాత్రం కనీస స్థాయిలో కూడా నీరు అందడం లేదని ఆరోపించారు. 200 క్యూసెక్కుల నీరు వెళ్లాల్సిన కాలువలో 15 క్యూసెక్కుల నీరు కూడా సక్రమంగా పారకపోతే రైతులు ఎవరిని ఆశ్రయించాలి అని ప్రశ్నించారు. ఫేజ్--2 పై ప్రభుత్వ అధికారులు మరియు అధికార పార్టీ రాజకీయ నాయకులు ఎందుకు మౌనం ఫేజ్--2 పంప్‌హౌస్‌లో కాపర్ వైర్ చోరీ జరిగి చాలా కాలమైనా దొంగలను పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని మల్లయ్య ఆరోపించారు. తాను పంప్‌హౌస్‌ను సందర్శించి ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ తెస్తామని అధికారులు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్ తెస్తాం, నీళ్లు ఇస్తాం, సమస్య పరిష్కరిస్తాం, అంటూ మాటలు చెబుతున్నారు. కానీ రైతు పొలంలో మాత్రం ఒక్క చుక్క నీరు కనిపించడం లేదు అని విమర్శించారు. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. కాలువలకు నీరు వస్తే భూగర్భజలాలు కూడా మెరుగుపడి బోర్లలో నీటి లభ్యత పెరుగుతుందని, మండలంలోని గ్రామాలకు తాగునీటి సమస్య కూడా కొంతవరకు పరిష్కారం అవుతుందని అన్నారు. కనీసం జూరాల నుంచి గోపాలదిన్నె రిజర్వాయర్‌కు నీటిని తీసుకొచ్చి రైతులకు విడుదల చేయాలని బీజేపీ పార్టీ నాయకులు డిమాండ్ చేసారు. జూరాల నీరు కాలువల్లోకి వస్తే చిన్నంబావి మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో సాగునీరు, తాగునీటి సమస్యలకు కొంతమేర ఉపశమనం లభిస్తుందని తెలిపారు. సింగోటం నుంచి గోపాలదిన్నె రిజర్వాయర్‌కు లింక్ ఏర్పాటు చేసి నీటిని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ మల్లయ్య తీవ్ర విమర్శలు చేశారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు పెంచుతామని హామీలు ఇచ్చారని, కానీ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. హామీల సంఖ్య చెప్పుకోవడంలో ముందున్నారు అమలు చేయడంలో మాత్రం వెనుకబడ్డారు. చిన్నమారూర్ లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద పెద్ద ఎత్తున జలదీక్ష చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని కురువ చిన్న మల్లయ్య హెచ్చరించారు. రైతుల సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆగదు. నీళ్లు రైతు హక్కు హామీ కాదు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి అని ఆయన స్పష్టం చేశారు.

# బాలానగర్‌లో ఘనంగా అమ్మవారి తొట్టెల, పలారం బండి ఊరేగింపులు,భక్తులతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేసిన వడ్డేపల్లి రాజేశ్వరరావు



కూకట్పల్లి ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ)
ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్, సాయినగర్, రాజు కాలనీలలో అమ్మవారి తొట్టెలు, గొర్రె పొట్టేళ్ల పలారం బండి ఊరేగింపులు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి.అత్తికారి మల్లేష్, నరేందర్ గౌడ్, ప్రదీప్ రెడ్డి, బండారి నవీన్ ప్రకాష్ గౌడ్, బాలింగ్ రాము ముదిరాజ్ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఊరేగింపుల్లో వివిధ కళాబృందాలు పాల్గొని తమ కళా ప్రదర్శనలతో భక్తులను అలరించాయి.నిర్వాహకుల ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈ ఊరేగింపుల్లో పాల్గొని అమ్మవారి దివ్య దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులతో కలిసి వారి కోరిక మేరకు కొద్దిసేపు డప్పుల చప్పులకు లయబద్ధంగా నృత్యం చేసి యువతలో ఉత్సాహాన్ని నింపారు.వడ్డేపల్లి రాజేశ్వరరావు ఊరేగింపులో పాల్గొనడంతో నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు నిర్వాహకులను అభినందిస్తూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో , ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పండుగ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కంచి మహేందర్ యాదవ్, సతీష్ గౌడ్, సురేందర్ రెడ్డి, రమేష్, డాక్టర్ కిరణ్, శ్రీనివాస్, శ్రవణ్ స్థానిక నాయకులు కార్యకర్తలు, నిర్వాహకులు, భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బంజారాల "తీజ్" పండుగలో పాల్గొన్న ఆర్ ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్



ఆర్మూర్,ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ)
బంజారాల పెద్ద పండుగ "తీజ్" పండుగలో కల్లెడ తండా,అమ్రాద్ తండా, మదనపల్లి తండా లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కుమార్తె ఆర్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుజాత రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పైడి సుచరిత రెడ్డి మాట్లాడుతూ:శ్రావణ మాసంలో బంజారా తండాలలో "తీజ్" పండుగను తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ పండుగను నిర్వహిస్తారు.పెళ్లి కాని యువతులు పుట్టమన్ను తెచ్చి బాట (బుట్టలలో) గోధుమలను విత్తి,రోజూ పూజలు చేస్తూ వాటికి నీరు పోస్తూ మొలకలు వచ్చేలా చూస్తారు.చివరి రోజున మహిళలు ఆ గోధుమ మొలకల బుట్టలను తలపై పెట్టుకుని,లంబాడీల సంప్రదాయ నృత్యాలు చేస్తూ జలాశయాలలో నిమజ్జనం చేస్తారు అని అన్నారు. "తీజ్" పండుగ ప్రకృతితో ముడిపడి ఉందని బంజారా లు అంటే అడవి తల్లి బిడ్డలని అన్నారు.

# కురుమ కులస్తుల బోనాల వేడుకల్లో పాల్గొన్న మనాలి ఠాకూర్



గోదావరిఖని న్యూస్ ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ)
రామగుండం శాసనసభ్యులు గౌరవనీయులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్,సతీమణి శ్రీమతి మనాలి ఠాకూర్,ఈరోజు కురుమ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.కురుమ కులస్తుల సోదర సోదరీమణులతో కలిసి సంప్రదాయబద్ధంగా నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొని, వారికి శు భాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవడం సంతోషంగా ఉందని శ్రీమతి మనాలి ఠాకూర్ పేర్కొన్నారు.

# వేజ్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయాలి

**-కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిఎం ఆఫీస్ ఎదుట ధర్నా**



మందమర్రి ఆగస్ట్ 10 (జర్నలిస్ట్ డైరీ)
కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని,12 వ వేజ్ బోర్డు కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని,నిత్యవసర ధరలకు అనుగుణంగా వేతనాలు, అలవెన్సులు పెంచాలని డిమాండ్ చేస్తు సోమవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఏఐటీయుసి, ఐఎన్టీయుసి,సిఐటీయు, ఎచ్ఏంఎస్ నాలుగు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ..12వ వేజ్ బోర్డు కమిటీని వెంటనే ఏర్పాటు చేసి,వేజ్ బోర్డు చర్చలను ప్రారంభించాలని ప్రస్తుతం దేశంలో రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు,అలవెన్సులు పెంచి వారి జీవన ప్రమాణాలను కాపాడాలని కోరారు.అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో కార్మికులపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని దృష్టిలో పెట్టుకుని,కార్మికులకు మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత,హక్కులు కల్పించాలని నాయకులు స్పష్టం చేశారు.ధర్నా అనంతరం ఏరియా జి.ఏం కు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన మెమొరాండం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏ ఐ టీ యు సి మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ. సెంట్రల్ సెక్రటరీ ఏం డి.అక్బర్ అలీ. ఏరియా నాయకులు దాగం మల్లేష్.ఐ ఎన్ టీ యు సి సెంట్రల్ సెక్రటరీ కాంపెల్లి సమ్మయ్య. ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య. రామ్ శెట్టి నరేందర్. సి ఐ టీ యు అధ్యక్షుడు సాంబార్ వెంకటస్వామి.కార్యదర్శి అల్లి రాజేందర్.ఎచ్ ఏం ఎస్ ఏరియా నాయకులు పార్వతి రాజిరెడ్డి. శ్రీనివాస్ రెడ్డి, తదితరులు, పాల్గొన్నారు.

## బిజినెస్

# పెరిగిన వెండి ధరలు..




**హైదరాబాద్**
హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో సోమవారం వెండి ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఉదయం కేజీ వెండి ధర రూ.2,45,000గా నమోదవగా, మధ్యాహ్నానికి రూ.5,000 పెరిగి రూ.2,50,000కు చేరుకుంది. దీంతో వెండి కొనుగోలు దారులు, పెట్టుబడిదారులు మార్కెట్‌పై ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల అంతర్జాతీయ మార్కెట్‌లో విలువైన లోహాల ధరల్లో నెలకొన్న హెచ్చుతగ్గుల ప్రభావం దేశీయ మార్కెట్‌పైనా కనిపిస్తోంది. ఇక బంగారం ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదు. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,970 వద్ద కొనసాగుతుండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,39,300గా స్థిరంగా ఉంది. బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, వెండి ధరలు పెరగడం మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ మార్కెట్ ధోరణులు, డాలర్ మారకం విలువ, పారిశ్రామిక అవసరాలు వంటి అంశాలు వెండి ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. రాబోయే రోజుల్లో కూడా వెండి ధరల్లో మరింత హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు.

# రూ.5 లక్షల్లోపు బడ్జెట్‌లో ఎక్కువ మైలేజ్ ఇచ్చే టాప్ 5 కార్లు.. ఇవే బెస్ట్ ఆప్షన్స్!

పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కారు కొనుగోలుదారులు మైలేజ్‌తో పాటు నిర్వహణ ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ముఖ్యంగా తక్కువ బడ్జెట్‌లో కారు కొనాలని భావించే వారికి మంచి మైలేజ్ ఇచ్చే కార్లు ఆకర్షణీయమైన ఎంపికగా మారుతున్నాయి.
రూ.5 లక్షల్లోపు ప్రారంభ ధర పరిధిలో అందుబాటులో ఉండే కొన్ని కార్లు మంచి మైలేజ్, తక్కువ నిర్వహణ ఖర్చులు, సిటీ డ్రైవింగ్‌కు అనువైన ఫీచర్లతో కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో మారుతి సుజుకి సెలెరియో, ఆల్టో కె10, ఎస్-ప్రెస్సో, రెనాల్ట్ క్విడ్, టాటా టియాగో వంటి మోడళ్లు ప్రముఖంగా నిలుస్తున్నాయి.

**1. మారుతి సుజుకి సెలెరియో**
మారుతి సుజుకి సెలెరియో మంచి మైలేజ్‌కు పేరుగాంచిన హ్యాచ్‌బ్యాక్‌లలో ఒకటి. సిటీ డ్రైవింగ్‌కు అనుకూలంగా ఉండటంతో పాటు నిర్వహణ ఖర్చులు కూడా తక్కువగా ఉండటం దీని ప్రత్యేకత. తక్కువ బడ్జెట్‌లో రోజువారీ ప్రయాణాలకు కారు కోరుకునే వారికి ఇది ఒక ఆప్షన్‌గా నిలుస్తుంది.

**2. మారుతి సుజుకి ఆల్టో కె10**
తక్కువ ధరలో కాంపాక్ట్ కారును కోరుకునే వారికి ఆల్టో కె10 మరో ఎంపిక. చిన్న సైజు కారణంగా



ట్రాఫిక్‌లో సులభంగా నడపవచ్చు. నగర ప్రయాణాలతో పాటు పార్కింగ్ విషయంలోనూ ఇది సౌకర్యంగా ఉంటుంది. మంచి ఇంధన సామర్థ్యం కారణంగా రోజువారీ వినియోగానికి అనుకూలంగా ఉంటుంది.

**3.మారుతి సుజుకి ఎస్-ప్రెస్సో**
SUV తరహా డిజైన్‌ను ఇష్టపడే వారికి ఎస్-ప్రెస్సో ఆకర్షణీయమైన ఎంపిక. కాంపాక్ట్ డిజైన్, సిటీ డ్రైవింగ్‌కు అనువైన పరిమాణం, మంచి ఇంధన సామర్థ్యం దీని ప్రధాన ప్రత్యేకతలు. తక్కువ నిర్వహణ ఖర్చులతో కారు కోరుకునే వారికి ఇది పరిశీలించదగిన మోడల్.

**4. రెనాల్ట్ క్విడ్**
రెనాల్ట్ క్విడ్ తక్కువ ధరలో స్టైలిష్ లుక్‌తో కూడిన హ్యాచ్‌బ్యాక్‌గా గుర్తింపు పొందింది. ఎత్తైన గ్రౌండ్ క్లియరెన్స్, కాంపాక్ట్ డిజైన్, సిటీ డ్రైవింగ్‌కు అనువైన ఫీచర్లు ఇందులో ఉన్నాయి. మంచి మైలేజ్‌తో పాటు ప్రత్యేకమైన డిజైన్ కోరుకునే వారికి క్విడ్ ఒక ప్రత్యామ్నాయంగా ఉంటుంది.

**5. టాటా టియాగో**
టాటా టియాగో ఈ జాబితాలో మరో ముఖ్యమైన కారు. ఆకర్షణీయమైన డిజైన్‌తో పాటు భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే కొనుగోలుదారులకు ఇది ఆసక్తికరమైన ఎంపిక. బేస్ వేరియంట్‌ను తక్కువ బడ్జెట్‌లో పరిగణించవచ్చు. మైలేజ్, నిర్మాణ నాణ్యత, ఫీచర్లను కలిపి చూసే వారికి టియాగో ఉపయోగకరమైన ఆప్షన్‌గా నిలుస్తుంది.

**కారు కొనేముందు ఇవి కూడా చూడండి**
కారు కొనుగోలు సమయంలో కేవలం మైలేజ్‌ను మాత్రమే కాకుండా భద్రత, నిర్వహణ ఖర్చులు, సర్వీస్ సదుపాయాలు, ఇన్సూరెన్స్, రీసేల్ విలువ, ఫీచర్లు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా రోజువారీ సిటీ ప్రయాణాల కోసం కారు కొనాలనుకునే వారు తమ అవసరాలకు సరిపోయే మోడల్‌ను ఎంచుకోవడం మంచిది.


# డ్రై ఫ్రూట్స్ ఉత్పత్తిలో అమెరికాదే అగ్రస్థానం!

ప్రపంచంలోనే అత్యధికంగా డ్రై ఫ్రూట్స్ ఉత్పత్తి చేసే దేశం అమెరికా అని, తాజాగా నిర్వహించిన ఓ అధ్యయనంలో తెలింది. దీనికి కాలిఫోర్నియాలో బాదం, వాల్‌నట్స్ సాగు ప్రధాన కారణమని పేర్కొంది. అమెరికా వాటా 15% కాగా, పిస్తాలో ఇరాన్, ఆప్రికాట్లు, హాజెల్ నట్స్, అత్తి పండ్లు, ఎండుద్రాక్షల్లో టర్కీ ముందున్నాయి. భారతదేశం ఉత్పత్తితో పాటు వినియోగంలోనూ ముందుంది. కాగా ఆరోగ్య స్పృహ పెరగడంతో డ్రై ఫ్రూట్స్ మార్కెట్ వృద్ధి చెందుతోంది.



## ఐపీఎల్ ట్రేడింగ్‌లో హార్దిక్ పాండ్యా హవా..
# ముంబై కెప్టెన్‌పై సీఎస్కే, కేకేఆర్ నజర్!

**-హార్దిక్ పాండ్యా చుట్టూ ఐపీఎల్ ట్రేడింగ్ వార్తలు**
**-ఆల్ రౌండర్ కోసం రేసులో సీఎస్కే, కేకేఆర్!**
**-భారీ ఆఫర్ కోసం ఎదురుచూస్తున్న ముంబై!**





ఐపీఎల్ ట్రేడింగ్ విండోలో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పేరు మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ నుంచి పాండ్యాను తమ జట్టులోకి తీసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. లక్నో సూపర్ జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు కూడా ఆసక్తిగా ఉన్నప్పటికీ, ఇప్పటివరకు పెద్దగా చర్చలు జరగలేదట. గుజరాత్ టైటాన్స్ జట్టును మొదటి సీజన్లోనే విజేతగా, రెండో సీజన్లో రన్నరప్‌గా నిలబెట్టిన హార్దిక్ పాండ్యా, ముంబై ఇండియన్స్‌లో మాత్రం స్థిరమైన ప్రదర్శన ఇవ్వలేకపోయాడు. మూడు సీజన్లలో ఒకేసారి ప్లే ఆఫ్స్ చేరాడు. కానీ ఫాస్ట్ బౌలింగ్ చేయగల ఆల్‌రౌండర్‌గా, టీమ్‌కు మంచి బ్యాలెన్స్ తెచ్చే లీడర్‌గా ఐపీఎల్‌లో అతడికి మంచి డిమాండ్ ఉంది. అందుకే ఫ్రాంచైజీలు హార్దిక్ కోసం పోటీ పడుతున్నాయి. ముంబై ఒకవేళ ట్రేడింగ్ చేసే యోచనలో ఉంటే, ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన అక్షర్ పటేల్‌తో స్వాప్ చేసుకోవచ్చనే చర్చ సాగుతోంది. అక్షర్ రాకతో ముంబై స్పిన్ విభాగం బలపడటమే కాకుండా విదేశీ ఆల్‌రౌండర్లపై ఆధారపడటం తగ్గుతుంది. అయితే, తమ స్టార్ ఆల్‌రౌండర్‌కు ప్రతిఫలంగా అగ్రశ్రేణి భారతీయ బ్యాటర్ లేదా బౌలర్‌ను మాత్రమే కోరాలని ముంబై భావిస్తోంది. కేకేఆర్ ఫ్రాంచైజీ కామెరూన్ గ్రీన్‌ను ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. కానీ రాబోయే యాషెస్ సిరీస్ దృష్ట్యా అతని లభ్యతపై అనుమానాలు ఉండటంతో ముంబై సుముఖంగా లేదు. అటు సీఎస్కే విషయానికొస్తే, నూతన ఓవర్సీస్ కోచ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాతే హార్దిక్ పాండ్యా ట్రేడ్‌పై నిర్ణయం తీసుకుంటామని సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు.

## స్పోర్ట్స్

# కొత్త ఇన్నింగ్స్‌కు రహానే రెడీ.. ఆ ఫ్రాంచైజీతో ఒప్పందం..!

**యూరోపియన్ లీగ్‌లో ఆడనున్న రహానే**
**ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ తరఫున ఎంట్రీ**
**ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు**




ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్, ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన అజింక్య రహానే మరో కొత్త అవతారంలో కనిపించనున్నాడు. ఐపీఎల్ జట్టుకు కోచ్ లేదా మెంటార్, క్రికెట్ కామెంటేటర్‌గా రహానే మారతాడని అంతా భావించారు. కానీ అతడు మాత్రం కెరీర్‌లో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్-2026లో ఆడేందుకు అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ జట్టుతో అజింక్య ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ యాజమాన్యం అధికారికంగా వెల్లడించింది.ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ అతడిని తమ కీలక ఆటగాడని అభివర్ణించింది. కాగా ఈ లీగ్ తొలి సీజన్ ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 20 వరకు జరగనుంది. ఇందులో గ్లాస్గో, అమ్‌స్టర్‌డామ్, ఎడిన్‌బర్గ్, డబ్లిన్, బెల్ఫాస్ట్, రోటర్‌డామ్ నగరాలకు చెందిన 6 ఫ్రాంచైజీలు పోటీ పడనున్నాయి. కాగా అమ్‌స్టర్‌డామ్ ఫ్రాంచైజీ యాజమానులుగా ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం స్టీవ్ వా, ప్రముఖ బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్‌లు ఉన్నారు. రహానేకు ఉన్న అనుభవం జట్టుకు ఉపయోగపడుతుందని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.కాగా 2011లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన రహానే, టీమిండియా సాధించిన అనేక చారిత్రక విజయాల్లో భాగమయ్యాడు. దేశం తరఫున అన్ని ఫార్మాట్లలో కలిసి 195 మ్యాచ్‌లు ఆడాడు. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌లో జట్టులో అత్యంత కీలకమైన ప్లేయర్‌గా ఎదిగాడు. కెరీర్‌లో 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. టెస్టుల్లో 5,000 పైచిలుకు పరుగులు చేసి భారత జట్టుకు ఎన్నో క్లిష్ట సమయాల్లో ఆదుకున్నాడు. రెడ్‌బాల్ క్రికెట్‌లో రహానే 38.46 సగటుతో మొత్తం 5077 పరుగులు చేశాడు. తన కెరీర్‌లో మొత్తంగా టెస్టుల్లో 12, వన్డేల్లో 3 శతకాలు కొట్టాడు. 2023లో భారత్ తరఫున చివరిసారి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. ఇక ఐపీఎల్‌లో 212 మ్యాచ్‌లు ఆడిన రహానే.. 5,367 పరుగులు సాధించాడు. ఐపీఎల్-2023 సీజన్ ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో రహానే సభ్యుడిగా ఉన్నాడు. 2025, 2026 సీజన్లలో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు.

# డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు.. ఏ జట్టుకు ఎన్ని విజయాలు కావాలంటే?

**-డబ్ల్యూటీసీ ఫైనల్ అర్హత సమీకరణాలు**
**-భారత్‌కు 8 విజయాలు తప్పనిసరి**
**-ఇంగ్లాండ్, పాకిస్థాన్, వెస్టిండీస్ ఔట్!**

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 సైకిల్‌లో ఫైనల్ బెర్త్ దక్కించుకునేందుకు ప్రధాన జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ప్రస్తుతం పాయింట్స్ టేబుల్‌లో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. రెండో ప్లేసులో సౌతాఫ్రికా ఉన్నాయి. ఇక భారత్ ఐదో ప్లేసులో ఉంది. డబ్ల్యూటీసీ సైకిల్ 2025-2027లో మ్యాచులు పూర్తయ్యే సరికి టాప్-2లో నిలిచిన జట్ల మధ్య ఫైనల్ జరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న పాయింట్స్ టేబుల్ ప్రకారం.. ఏ జట్లు ఎన్ని మ్యాచులలో గెలిస్తే ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంటాయో ఇప్పుడు చూద్దాం..ఆస్ట్రేలియా జట్టు ఫైనల్ చేరాలంటే తమ మిగిలిన 14 టెస్టుల్లో 8 విజయాలు సాధిస్తే సరిపోతుంది. ఆ జట్టు భారత




గడ్డపై ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆడాల్సి ఉంది. ప్రస్తుత ఛాంపియన్ సౌతాఫ్రికాకు ఉన్న 10 మ్యాచుల్లో 6 విజయాలు అవసరం కాగా, న్యూజిలాండ్ 10 టెస్టుల్లో 7 విజయాలు నమోదు చేయాల్సి ఉంది. అదేవిధంగా బంగ్లాదేశ్ తాము ఆడాల్సిన 8 మ్యాచుల్లో 6 గెలవాల్సి ఉంది. ఇక టీమిండియా విషయానికి వస్తే.. 90 శాతం మ్యాచులు గెలవాల్సిన పరిస్థితి ఉంది. భారత్ ఇంకా.. 9 టెస్టులు ఆడాల్సి ఉంది. ఇందులో కనీసం 8 గెలిస్తేనే.. ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా ఫైనల్ చేరుతుంది. దీంతో రాబోయే శ్రీలంక సిరీస్‌లో 2 టెస్టులు, న్యూజిలాండ్ పర్యటనలో 2 టెస్టులతో పాటు స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరగబోయే 5 టెస్టుల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ భారత్‌కు అత్యంత కీలకంగా మారనున్నాయి.శ్రీలంక 8 టెస్టుల్లో 7 మ్యాచ్‌ల్లో విజయం సాధిస్తేనే ఫైనల్ రేసులో నిలవగలదు. పాకిస్థాన్.. మిగిలిన ఏడు మ్యాచులలోనూ గెలవాల్సిన పరిస్థితి ఉంది. ఇంగ్లాండ్, వెస్టిండీస్ జట్లు దాదాపుగా ఫైనల్ రేసు నుంచి తప్పుకున్నాయి. అయితే ఇతర జట్ల మ్యాచులు డ్రాగా ముగిస్తే, తక్కువ విజయాలతో కూడా కొన్ని జట్లకు సమీకరణాలు మారే అవకాశముంటుంది. ఇంగ్లాండ్ వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగనుంది.
డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్‌లో భారత జట్టు ఫైనల్ చేరుతుందని భావిస్తున్నారా? మీ అభిప్రాయాన్ని కామెంట్స్ బాక్స్‌లో పంచుకోండి.



రెచ్చిపోతున్న రకుల్ ప్రీత్ సింగ్.

# మిస్టరీ లుక్‌తో అదరగొట్టిన ఫస్ట్ లుక్..

## సినిమాపై పెరిగిన క్యూరియాసిటీ!




నారా రోహిత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కపాలి'. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే డిఫరెంట్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను దర్శకుడు రామ్ గన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌ను ఎంతో క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. హన్సిక ముఖాన్ని బ్లాక్ అండ్ వైట్ హ్యాండ్ స్కెచ్ తరహాలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్, సీరియస్ లుక్ చూస్తుంటే సినిమాలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అనిపిస్తోంది. సాధారణమైన దుస్తులతో, మెడలో చిన్న చైన్‌తో కనిపిస్తున్న హన్సిక చూపుల్లో ఏదో తెలియని రహస్యం దాగి ఉన్నట్లుగా పోస్టర్‌ను రూపొందించారు.హన్సిక ముఖంతో పాటు పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అంశాలు కూడా సినిమా కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రాచీన కాలానికి చెందినట్లుగా కనిపించే కొన్ని గుర్తులు, వింతైన సింబల్స్ పోస్టర్ చుట్టూ కనిపిస్తున్నాయి. మరోవైపు చీకటి అడవిలో భారీ చెట్ల మధ్య నుంచి సూర్యకాంతి ప్రసరించేలా రూపొందించిన విజువల్ కూడా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళు_తున్న ఓ వ్యక్తి నీడ పోస్టర్‌లో మరింత సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తోంది. దీంతో 'కపాలి' కేవలం సాధారణ హారర్ కథ కాకుండా.. మిస్టరీ, సైకాలజీ, సస్పెన్స్ అంశాలతో కూడిన డార్క్ థ్రిల్లర్‌గా ఉండబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. సాధారణంగా కనిపించే దెయ్యాలు, భయపెట్టే సన్నివేశాలకే పరిమితం కాకుండా.. అంతుచిక్కని చీకటి ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేలా 'కపాలి' కథ ఉండబోతున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కనిపించని శక్తులు, పురాతన గుర్తులు, మిస్టరీ అంశాల చుట్టూ కథ నడుస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా పోలీస్ బ్యాక్‌డ్రాప్‌లో సైకలాజికల్ హారర్ ఎలిమెంట్స్‌ను మేళవించడం సినిమాకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో హన్సిక పాత్ర ఎలా ఉండబోతుంది? నారా రోహిత్ పోషిస్తున్న పోలీస్ పాత్రకు ఆమె పాత్రకు ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. సప్త అశ్వ మీడియా వర్క్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. విజయ్ కృష్ణ లింగమనేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. విజువల్‌గా కూడా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.

# నాడు కలవలేకపోయా.. నేడు కలిసి నటించా..!

విశ్వనాథ్ అండ్ సన్స్'లో సూర్యసార్‌తో కలిసి నటించడం నిజంగా నాకు అనుకోని వరమే' అంటున్నది కేరళ కస్తూరి మమితాబైజు. ప్రస్తుతం ప్రతిష్టాత్మక చిత్రాల్లో నటిస్తూ ఫుల్ ఫామ్‌లో ఉన్నది ఈ అందాల భామ. ఆమె సూర్యకు జోడీగా నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా ఈ నెల 14న విడుదల కానున్నది. ఈ సందర్భంగా కొచ్చీలో జరిగిన ఈ సినిమా ఈవెంట్‌లో సూర్య అభిమానిగా మారిపోయింది మమితాబైజు. 2015లో సూర్యను కలవాలని తాను ప్రయత్నించిన క్షణాలను ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నది.'2015లో నేను 8వ తరగతి చదువుతున్నాను. అదే స్కూల్‌లో మా అన్నయ్య 11వ తరగతి చదువుతున్నాడు. ఆ ఏడాది ఏదో సినిమా ఈవెంట్‌కి కొచ్చీలోని ఓ మాల్‌కి సూర్యసార్ వచ్చారు. దాంతో మా అన్నయ్య.. తన స్నేహితులతో కలిసి సూర్య సార్‌ని చూసేందుకు కొచ్చీ వెళ్లాడు. అప్పుడు అన్నయ్యతో కలిసి నేనూ కొచ్చీ వెళ్లాలని ట్రై చేశాను. కానీ అమ్మానాన్న వెళ్లనివ్వలేదు. ఆ తర్వాత సూర్యసార్‌తో దిగిన ఫొటోలను మా అన్నయ్య నాకు చూపించాడు. వాటిని చూసి నిరాశకు లోనయ్యాను. కానీ ఇప్పుడు ఆయనతో కలిసి ఓ సినిమాలో నటించాను. ప్రస్తుతం ఆయనతో కలిసి ఇక్కడ నిలబడ్డాను. ఇది నాకొక గొప్ప గౌరవం' అంటూ భావోద్వేగానికి లోనయింది మమితాబైజు.




# కిరణ్ అబ్బవరం కొత్త సినిమా టైటిల్ ఇదే..

## పాన్ ఇండియా మైథలాజికల్ మూవీపై అందరిలో ఆసక్తి!



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ఇటీవల ఆయన నటించిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి రెస్పాన్స్ అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా సత్తా చాటుతోంది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న కిరణ్.. మరోవైపు భారీ స్థాయిలో తెరకెక్కనున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కిరణ్ అబ్బవరం ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో ఓ భారీ బడ్జెట్ మైథలాజికల్ సినిమాలో నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కీలక వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి 'ఇంద్రపుత్ర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర బృందం ఆసక్తిని పెంచింది. పేరు చూస్తేనే ఇది పురాణ, ఇతిహాస నేపథ్యంతో రూపొందనున్న భారీ చిత్రమనే విషయం స్పష్టమవుతోంది. ఈ సినిమాతో శ్రీకాంత్ పుప్పాల దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఆయన గతంలో 'కాంతార చాప్టర్ 1' చిత్రానికి ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ అనుభవాన్ని ఇప్పుడు తన తొలి దర్శకత్వ చిత్రానికి ఉపయోగించుకోనున్నారు. భారీ విజువల్స్, పురాణ నేపథ్యం, విభిన్నమైన కథాంశంతో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రూపొందించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. 'ఇంద్రపుత్ర' రెగ్యులర్ షూటింగ్‌ను అక్టోబర్‌లో ప్రారంభించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌ను పలు భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా కేవలం ఒక కథతో ముగిసిపోయే ప్రాజెక్ట్ కాదని తెలుస్తోంది. మేకర్స్ రూపొందించనున్న మైథలాజికల్ యూనివర్స్‌లో 'ఇంద్రపుత్ర' మొదటి అధ్యాయంగా ఉండబోతున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా తర్వాత ఇదే ప్రపంచంలో మరిన్ని కథలు, పాత్రలతో సినిమాలు తెరకెక్కించే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్‌తో కలిసి నిర్మాణ బృందం భారీ స్థాయిలో రూపొందిస్తోంది. కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం కథ, ప్రీ-ప్రొడక్షన్ పనులను పూర్తి చేసే దిశగా చిత్ర బృందం ముందుకు సాగుతోంది. మరోవైపు సినిమాలో కిరణ్ అబ్బవరం పాత్ర ఎలా ఉండబోతోంది? ఆయన సరసన నటించబోయే హీరోయిన్ ఎవరు? ఇతర కీలక పాత్రల్లో ఎవరెవరు కనిపించనున్నారు? వంటి విషయాలపై ఆసక్తి నెలకొంది. నటీనటులు, సాంకేతిక నిపుణులు, కథకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు.

# టాక్సిక్‌ను సక్సెస్ ఫుల్‌గా తీసి చూపా




'టాక్సిక్' ప్రారంభించినప్పుడు చాలా మంది 'నీ వల్ల కాదు' అన్నారని అలాంటివాళ్లకు చిత్రం పూర్తి చేసి తన సత్తా చూపించానని దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ఎమోషనల్ అయ్యారు. ఆమె దర్శకత్వంలో యశ్ హీరోగా తెరకెక్కిన 'టాక్సిక్' ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆ ఈవెంట్‌లో దర్శకురాలు మాట్లాడుతూ.. ఈ సినిమా మొదలు పెట్టినప్పుడు చాలా మంది తనను ఎన్నో మాటలు అన్నారని గుర్తుచేసుకున్నారు. తనపై నమ్మకం ఉంచి.. ఈ సినిమాను అంగీకరించినందుకు యశ్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465